ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

బాపట్ల జిల్లా వార్తలు

బుధవారం 9 ఏప్రిల్ 2025

మిస్సింగ్ సిటిజన్స్

గుర్తింపు



8

- ఎట్టకేలకు ఛేదించిన సచివాలయాల సిబ్బంది
- ఇప్పటికే 6.45 లక్షల మందిని గుర్తించి సచివాలయాలకు మ్యాపింగ్
- ఇంకా 5 వేల మంది ఆచూకీ కోసం వెతుకులాట



గ్యాస్ వడ్డన.. రూ.90 కోట్లు

- వినియోగదారులపై పెరిగిన భారం
- రెండేళ్ల తర్వాత వంట గ్యాస్‌పై వడ్డన
- ఉజ్వల, దీపం లబ్ధిదారులనూ వదలని ప్రభుత్వం

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండేళ్ల తర్వాత వంట గ్యాసు సిలిండరు ధర పెంచారు. గ్యాసు ధర పెరగడంతో సామాన్య కుటుంబాలపై భారం పడింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 18 లక్షల కుటుంబాలకు వంట గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో లబ్ధిదారుడు ఏడాదికి 8 నుంచి 10 సిలిండర్లు వినియోగిస్తారు. ఈ లెక్కన ఒక్కో కుటుంబంపై ఏటా రూ.500 భారం పడుతోంది. ఇలా 18 లక్షల మందిపై ఏడాదికి రూ.90 కోట్ల మేర అదనంగా భారం పడనున్నది. ఉజ్వల, దీపం పథకాల కింద కనెక్షన్లు తీసుకున్న వారిని కూడా ఈ సారి ప్రభుత్వం వదల్లేదు. దీంతో వారు కూడా ఈ గ్యాస్ భారం మోయాల్సి వస్తోంది. వంటగ్యాసు ధరల భారాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చి సామాన్యులపై భారం తగ్గిస్తోంది. కానీ కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం మోపేలా చేస్తుండడంతో వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సామాన్యులు గగ్గోలు..

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక పెట్రోల్, డీజిల్, వంటగ్యాసు ధరలు డజనుసార్లు పెరిగాయి. 2014 నాటికి 7 పదుల్లో ఉన్న ఆయిల్ ధరలు 2020 నాటికి 120 రూపాయల వరకూ వెళ్లింది. కరోనా కష్టాలతోపాటు, లాక్‌డౌన్ నష్టాలతో అల్లాడిపోయిన ప్రజలు ఆయిల్ ధరల పెంపుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కేంద్రం ధరలు తగ్గించింది. వంటగ్యాసు ధర 2014 నాటికి రూ.430 ఉండగా, 2023కి రూ.1200కి చేరింది. దీంతో ప్రజాగ్రహం వెల్లువెత్తింది. 2024 ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రూ.200 ధర తగ్గించి ప్రజల ఆగ్రహ జ్వాలను చల్లార్చింది. కాగా మళ్లీ ఇప్పుడు ధరలు పెంచడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ధరల పెంపుదల ఇంతటితో ఆగుతుందా.. లేక ఇంకా ఇంకా కొనసాగుతుందా.. అన్న భయం వారిని వెంటాడుతోంది. 2014- 16 మధ్య కేంద్రం 9 సార్లు ధరలు పెంచిన నేపథ్యంలో ఆ పరిస్థితిని తలుచుకుని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు.



ఆస్తి పన్ను.. మళ్లీ పెరిగింది

- మున్సిపాల్టీల్లో 15 శాతం పెరుగుదల
- ఐదేళ్లలో రెట్టింపు అయిన ఆస్తి పన్ను
- 1 నుంచి అమల్లోకి వచ్చిన పెంచిన పన్ను
- మూడు జిల్లాల్లో భారం రూ.60 కోట్లు పైగానే

మున్సిపల్ కేంద్రాల్లోని ఇళ్ల యజమానులపై మళ్లీ పన్ను భారం పడింది. మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను మరో సారి 15 శాతం పెరిగింది. ఈ పెంచిన పన్నులను ఈ నెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల మూడు జిల్లాల్లో పుర పౌరులపై దాదాపు రూ.60 కోట్లకు పైగానే ఆస్తి పన్ను భారం పడినట్లు అంచనా. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటేటా పెరుగుతోంది. మార్కెట్ విలువకు సమానమయ్యే వరకు పన్ను పెరుగుతునే ఉంటుందని అధికారులు చెప్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో గృహ యజమానులపై పన్నుల రూపంలో మోయలేని పడుతున్న ఆర్థిక భారం మున్సిపాల్టీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. పన్ను పెరుగుదలకు హద్దే లేకుండా పోతుండడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ ప్రజలపై మరోసారి ఆర్థిక భారం పడింది. ఏటా పన్నుల పెంపుదల పురపాలక సంఘాలకు కాసుల వర్షం కురిపిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీలలో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మర్చేసింది. మార్కెట్ విలువ(రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా ఆస్తి పన్నును విధించింది. ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేశారు. దీని ఆధారంగా మున్సిపాల్టీల్లో అధికారులు ఆస్తి పన్ను నిర్ణయించారు. గతంలో అద్దె విలువ, మున్సిపాల్టీలో జోన్ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణనలోకి తీసుకునేవారు. మున్సిపాల్టీ గెజిట్ ప్రకారం జోన్ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనానికి మాత్రమే పన్ను విధించే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతో పాటు, చుట్టూ ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధించారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయవచ్చో మున్సిపాల్టీలలో నూతన ఆస్తి పన్ను విధానం తెలియజేస్తున్నది. ఆస్తి విలువ ఆధారంగా గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారించారు. తేడా ఉన్న ప్రకారం ఏటా 15 శాతం పన్ను పెంచుతూ వస్తున్నారు. ఈ పన్నుల విధానం సరైనది కాదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఉదాహరణకు ఓ వ్యక్తి తన గతంలో ఇంటికి ఏటా రూ.492 పన్ను చెల్లించే వాడు.. దీనికి ఏటా ప్రభుత్వం 15 శాతం చొప్పున పెంచేస్తోంది. వరుసగా ఐదో ఏడాది కూడా పన్ను పెరిగింది. ఇలా పెరిగిన పన్నుతో అది రూ.990కి చేరింది. అంటే నాలుగేళ్లలో ఆ వ్యక్తిపై అదనంగా రూ.498 పన్ను భారం పడింది. గుంటూరు కార్పొరేషన్‌లో గత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు ఉంటే ఈ పన్ను ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.115కు పెరిగింది. అంటే మిగిలిన మున్సిపాల్టీల్లోనూ ఇదే స్థాయిలో పన్నులు పెరిగాయి.

కొనసాగుతున్న వైసీపీ పన్ను విధానం

మున్సిపాల్టీల్లో పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం 2020-21లో మార్చేసింది. ఆస్తి విలువ ప్రకారం పన్నును ఏటా 15 శాతం పెంచేలా నిర్ణయించింది. ఈ ప్రకారం గత నాలుగేళ్లు పన్ను పెంచుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వంలో పన్నుల విధానాన్ని మారుస్తుందని ప్రజలు ఆశించారు. అయితే ఈ ప్రభుత్వం కూడా వైసీపీ పన్నుల పెంపు విధానాన్ని కొనసాగించినట్లు ఈ నెలలో పెరిగిన 15 శాతం పన్నుతో తేలింది. గత నాలుగేళ్లుగా పెంపుదలతో ఇప్పటికే పన్ను భారం ప్రతీ ఒక్కరిపైనా రెట్టింపు అయింది. ఆస్తి పన్ను విషయంలో వైసీపీ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పన్నులు పెరిగితే గృహ యజమానులు అద్దెలు పెంచుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

50 శాతం వడ్డీ రాయితీ అమలు

పన్ను బకాయిదారుల నుంచి వసూలు చేసిన ఆస్తి పన్నుపై ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నుపై వడ్డీ చెల్లించిన వారికి దానిలో 50 శాతం తిరిగి ఇస్తోంది. అయితే ఈ మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఆరు నెలలకు సంబంధించిన పన్నులో తగ్గించారు. వడ్డీ రాయితీను పన్నుదారులకు తిరిగి చెల్లించినట్లుగా పన్ను దారుల ఖాతాను పరిశీలిస్తే తెలుస్తోంది.

5 శాతం రాయితీ

పురపాలక సంఘాల్లో ఆస్తి పన్నుపై ప్రభుత్వం 5 శాతం రాయితీ అమలు చేస్తోంది. సోమ వారం నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది. పన్ను రూ.100 ఉంటే రూ.5 రాయితీ ఇస్తారు. రాయితీపై ఆస్తి పన్ను చెల్లించేందుకు ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చారు. పన్ను రాయితీపై మున్సిపల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో పలువురు స్వచ్ఛందంగా వచ్చి పన్నులు కడుతున్నారు. దీంతో ఈ రెండు రోజుల్లోనే రూ.6.60 కోట్లు వసూలు కావడం గమనార్హం.



ఆస్తి పన్ను లక్ష్యం రూ.522.28 కోట్లు

గుంటూరు కార్పొరేషన్ సహా మూడు జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూలు లక్ష్యం రూ.522.28 కోట్లు. ఈ మొత్తంలో బకాయిలు భారీగానే ఉన్నాయి. పల్నాడు జిల్లా పన్ను వసూలు లక్ష్యం రూ.77.03 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు జిల్లాల్లో రూ.406.97 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.38.28 కోట్లు పన్ను వసూలు లక్ష్యంగా ఉంది.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పంపిణీ ప్రారంభం
- ఒక్కో విద్యార్థికి రూ.3 వేలకిపైగా భారం నుంచి ఊరట
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 వేల మందికి లబ్ధి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 8 ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఈ ఏడాది కూడా ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 30 పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్లస్ టూ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో దాదాపు 15 వేల మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్ చదివే ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి జూనియర్ కళాశాలల పునః ప్రారంభం కాగా కళాశాలకు వచ్చిన విద్యార్థులకు పుస్తకాలను అధ్యాపకులు అందజేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద, దిగువ మధ్యతరగతి వర్గాల వారే. పుస్తకాలకు విద్యార్థులు రూ.3 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రెండేళ్లుగా ఇంటర్ విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ చేపట్టింది. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, రికార్డులు పంపిణీ వల్ల ఆర్థికంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూతగా మారింది. పుస్తకాలను ఉచితంగా అందజేయడం వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉందని ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు.

ఇంటర్ విద్యలో మార్పులకు శ్రీకారం

ప్రభుత్వం ఇంటర్ విద్యలో మార్పులకు శ్రీకారం చుడుతుంది. ఈ నేపథ్యంలోనే నూతన సంస్కరణలు ప్రవేశపెడుతున్నది. తొలుత ఇంటర్ విద్యార్థులకు కూడా కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ తర్వాత జేఈఈ అడ్వాన్స్‌తో పాటు ఎంసెట్ శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆయా శిక్షణలకు గుంటూరులోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను నోడల్ సెంటర్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సంస్కరణలు విద్యార్థుల అడ్మి షన్లు పెంపుకోసమేనని ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు.

8

ఎంఈవోల వసూళ్ల దందా

- విధులు విస్మరించి ఇద్దరు అధికారుల ఇష్టారాజ్యం

గుంటూరు మీదగా హుబ్లీ, కతిహార్‌కు ప్రత్యేక రైళ్లు

6

టూరిజం మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ అధికారిగా పద్మారాణి

నేడు వెలగపూడిలో సీఎం చంద్రబాబు ఇంటికి భూమి పూజ

ఉదయం 8.50 గంటలకు ముహూర్తం

6

సేవలపై సంతృప్తి

- ప్రభుత్వాస్పత్రి వైద్యసేవలపై పెరిగిన భరోసా!
- పనితీరుపై 74.14 శాతం, మందుల పంపిణీపై 79 శాతం సంతృప్తి
- ఐవీఆర్ఎస్ సర్వే ఫలితాలు వెల్లడి



8



శిశు గృహంలోని పిల్లల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి, స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ డి.రాధామాధవి

అనాథలను కన్నబిడ్డల్లా చూసుకుంటా

- పిల్లల బాగోగులను స్వయంగా పర్యవేక్షిస్తా
- పిల్లలను కొట్టినా, తిట్టినా వెంటనే చర్యలన్న కలెక్టర్
- బాపట్లలోని శిశుగృహ, బాలసదన్‌లో ఆకస్మిక తనిఖీలు

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అనాథ శిశువులను సొంత పిల్లలను చూసుకున్నట్లే చూసుకుంటానని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వారి బాగోగులను స్వయంగా పర్యవేక్షిస్తానన్నారు. బాపట్లలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ, బాలసదన్‌లను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నలుగురు శిశువులే ఉండగా దస్త్రాలలో 9 మంది శిశువులు ఉండటం ఏమిటని ప్రశ్నించారు? ఏడాదిలోపు ఉన్న నలుగురు శిశువులను ఇక్కడే ఉంచామని మిగిలిన చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్నారని సంబంధితాధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అనాథ శిశువులకు అందిస్తున్న పోషణ, వారి సంరక్షణ చర్యలు, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. విధులకు ఆలస్యంగా వచ్చిన శిశు గృహ మేనేజర్, మరొక సిబ్బందికి చార్జిమెమో జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బలహీనంగా ఉన్న ఏడాది శిశువుకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఏరియా వైద్యశాలలోని చిన్న పిల్లల వైద్యులు ప్రతిరోజు శిశు గృహాన్ని తప్పనిసరిగా సందర్శించాలన్నారు. శిశుగృహంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఓ ఆయా విధుల్లో నిర్లక్ష్యం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. పిల్లలను ఆమె కొడుతున్నట్లు సమాచారం వచ్చిందని అలా చేస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. పిల్లల విషయంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథ బాలికలు, పాక్షిక అనాథ బాలికల వివరాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ డి.రాధామాధవి, డీసీ పీవో పురుషోత్తం తదితరులు ఉన్నారు.

రూ.10 స్టాంప్.. రూ.60

- నాన్ జుడీషియల్ స్టాంప్‌లకు కొరత
- బ్లాక్‌మార్కెట్లోనూ రెండు నెలలుగా ఇబ్బందులు
- పరిస్థితి దారుణంగా మారినా స్పందించని రిజిస్ట్రేషన్ అధికారులు
- డీఆర్ కార్యాలయంలో ఉన్నా పంపిణీ చేయకపోవడంపై అనుమానాలు
- ఈ-స్టాంపింగ్ వారి ప్రయోజనం కోసమేనని ఆరోపణలు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాన్ జుడీషియల్ స్టాంపుల కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గడచిన నాలుగు నెలలుగా మార్కెట్‌లో కొరత తీవ్రంగా ఉంది. మొదటి రెండు నెలలు తమ వద్ద ఉన్న కొద్దిపాటి స్టాంప్‌లను వెండర్లు బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లోనూ నిండుకున్నాయి. అయితే రెండు నెలలుగా బ్లాక్‌లో కూడా స్టాంప్‌లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యధిక మంది స్టాంపు వెండర్ల వద్ద స్టాంపులు లేవు. ఉన్న వారు రూ.10 స్టాంప్‌ను రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు. పరిస్థితి దారుణంగా తయారైన రిజిస్ట్రేషన్ అధికారులు స్పందించడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాన్ జుడీషియల్ స్టాంప్‌లను పూర్తిగా తొలగించి రిజిస్ట్రేషన్ 2.0 పేరుతో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. నాన్ జుడీషియల్ స్టాంపులతో సంబంధం లేకుండానే ఈ-స్టాంపింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. చివరకు ఈ-స్టాంపింగ్‌ను కూడా ప్రైవేటు ఏజెన్సీకే కేటాయించారు. దీనిపై ప్రజల నుంచి నిరసన వ్యక్తం అయినా ప్రభుత్వం ముందుకే వెళ్లింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాన్ జుడీషియల్ స్టాంప్‌ల వినియోగాన్ని గతంలో మాదిరిగా కొనసాగించాలని ఆదేశించింది. అయితే ఇందుకు సంబంధించి నాన్ జుడీషియల్ స్టాంపులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్న విషయాన్ని విస్మరించింది. దీంతో గడచిన నాలుగు నెలలుగా గుంటూరులో నాన్ జుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి నాన్ జుడీషియల్ స్టాంపుల వినియోగం ఎక్కువైంది. ప్రజలు రూ.10, 20, 50, 100 స్టాంప్‌లను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే అవి అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆయా స్టాంపులను జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెప్పిస్తున్నప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో వెండర్లకు అందజేయడంలో జాప్యం చేస్తున్నారు. రెండు నెలల క్రితమే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వచ్చినప్పటికీ వాటిని ఆయా వెండర్లకు పంపిణీ చేయకపోవడం గమనార్హం. ఇదంతా ఈ-స్టాంపింగ్ వారి ప్రయోజనాల కోసమే అన్న ఆరోపణలు వస్తున్నాయి. నాన్ జుడీషియల్ స్టాంపులను బ్లాక్ చేస్తే ప్రజలు ఈ-స్టాంపింగ్ వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరతకు ఇదే కారణమని వెండర్లు ఆరోపిస్తున్నారు. దస్తావేజులు, ఒప్పందాలు మినహా మిగిలిన వాటికి ఈ-స్టాంపింగ్ వినియోగించుకుందాం అనుకున్నా సర్వర్ సమస్యల కారణంగా అవి కూడా సరిగా అందుబాటులోకి రావడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నేడు వెలగపూడిలో సీఎం ఇంటికి భూమి పూజ

ఉదయం 8.50 గంటలకు ముహూర్తం

తుళ్లూరు(వెలగపూడి), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రెవెన్యూలో ఈ- 6 రోడ్డు వెంట ఉన్న ఐదెకరాల స్థలంలో నిర్మించుకునే ఇంటికి సీఎం చంద్రబాబునాయుడు బుధవారం భూమి పూజ చేయనున్నారు. కుటుంబ సమేతంగా ఆయన కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఉదయం 8.50 గంటలు ముహూర్త సమయంగా పండితులు నిర్ణయించారు. దీంతో చంద్రబాబు ఆ సమయంలో భూమి పూజ చేయనున్నారు. ప్రైవేటు కార్యక్రమం కనుక రాజధాని రైతులతో సహా ఎవరికి ఆహ్వానం లేదు. అయితే వెలగపూడి గ్రామస్థులు పట్టు వస్త్రాలు పెట్టాలని సిద్ధమవడంతో పోలీసులు అనుమతి లేదని చెప్పారు. కుటుంబసభ్యులతో చేసుకునే ఈ కార్యక్రమానికి ఆటంకం కలిగించవద్దని మంగళవారం పోలీసులు వెలగపూడి గ్రామం లో తిరిగి ప్రజలకు సూచించారు.

ఎక్సైజ్‌స్టేషన్‌లో ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్ దేవ్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిధిలో వైన్ షాపులు, బార్ల పరిస్థితి గురించి వాకబు చేశారు. దుకాణాల పని వేళల పాటింపు, మద్యం అమ్మకాలు, నమోదైన కేసుల గురించి



వివరాలు తెలుసుకుంటున్న ఎక్సైజ్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

తెలుసుకున్నారు. చిలకలూరిపేట స్టేషన్ పరిధిలో రెవెన్యూ, వివిధ రకాల ఎక్సైజ్ నేరాల గురించి సమీక్షించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే వినయ్‌కుమార్‌కు పలు విషయాలపై సూచనలు చేశారు. స్టేషన్ కానిస్టేబుళ్ళతో మాట్లాడి వారి రోజువారీ విధుల గురించి తెలుసుకుని, మెరుగైన పనితీరు గురించి తగు సూచనలు చేశారు. ఈ సమీక్షలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, పల్నాడు జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే మణికంఠ, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే రవీంద్ర పాల్గొన్నారు.

1,41,802 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,44,443 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,41,802 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 66,917 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13300
273	--	--
341	10500	13900
4884	10000	11800
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10200	13500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12400
బ్యాడిగి 355	10000	13200
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10300	13200
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6400

రైతులు సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించాలి

● వీసీ ఆర్ శారదా జయలక్ష్మీదేవి



రైతు ప్రత్యామ్నాయ వ్యవసాయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శారదా జయలక్ష్మీదేవి తదితరులు

తాడికొండ(లాంఫాం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతులు సుస్థిర వ్యవసాయ విధానాలు, జీవ నియంత్రణ పద్ధతులు సమష్టిగా పాటించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ఆర్ శారదా జయలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు రక్షణ వేదిక వారు ప్రత్యామ్నాయ వ్యవసాయం ఎందుకు, ఎలా అనే అంశంపై చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రైతులు మితిమీరి, విచక్షణా రహితంగా వాడుతున్న ఎరువులు, పురుగుమందుల వల్ల సాగు ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. ఎగుమతులకు అనువుగా ఉన్న, అధిక దిగుబడి, ఆదాయాన్నిచ్చే పంటలు పండించాలని తెలిపారు. పలువురు వ్యక్తులు మాట్లాడుతూ వ్యవసాయ సాగు ఖర్చులు తగ్గించాలని, రైతు స్థాయిలో విత్తనోత్పత్తి జరగాలని విత్తన సాధికారిత సంపాదించాలని తెలిపారు. కౌలు రైతులకు ప్రోత్సహకాలు ఉండాలని, బయోడైవర్సిటీ, కమ్యూనిటీ సీడ్ డెవలప్‌మెంట్, పాతతరం విత్తనాలను సంరక్షించుకోవాలని సూచించారు. సుస్థిర వినియోగం, సంప్రదాయ వ్యవసాయ విధానాలు, కమ్యూనిటీ సీడ్స్ బ్యాంకులు వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం, ఎందుకు, ఎలా అనే అంశంపై డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రైతు రక్షణ వేదిక సభ్యులు కొల్లా రాజమోహన్‌రావు, హైదరాబాద్‌కు చెందిన డెవలప్ మెంట్ ఎకనామిక్స్ నేషనల్ ప్రొఫెసర్ డీ నరసింహరెడ్డి, సెంటర్ ఫర్ సస్టెయిన్‌బుల్ అగ్రికల్చర్ డైరెక్టర్ బీవీ రామాంజనేయులు, బీ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

బెల్లంకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతిచెందిన సంఘటన నందిరాజుపాలెంలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనలో బెల్లంకొండ మండలం మాచాయపాలెం విద్యుత్ లైన్‌మన్ మర్రి నరసింహారెడ్డి(33) మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం మర్రి నరసింహారెడ్డి స్వగ్రామం బెల్లంకొండ మండలం పాపాయపాలెం. నందిరాజుపాలెంలోని శివాలయం సమీపంలో 11కేవీ విద్యుత్ లైన్‌పై మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెల్లంకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు మర్రి నరసింహారెడ్డికి భార్య, సామ్రాజ్యం, కుమార్తెలు మణిప్రియ, వైష్ణవిలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

పోలవరం- బనకచర్లతో చంద్రబాబు భగీరథ ప్రయత్నం

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం, బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నానికి శ్రీకారం చుడుతున్నారని, కరువురహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో ఇది తొలి అడుగని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జలహారతి కార్పొరేషన్‌తో దశాబ్దాల దాహార్తిని తీర్చే ప్రగతి యజ్ఞానికి ముఖ్యమంత్రి నాంది పలికారన్నారు. పోలవరం- బనకచర్ల ప్రాజెక్టు కోసం కంపెనీ చట్టం కింద వందశాతం ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుచేస్తున్నారన్నారు. పల్నాడు ప్రాంతంతో పాటు ప్రకాశం, రాయలసీమ ప్రాంతాల్లో తరతరాలుగా పీడిస్తున్న కరువును తీర్చే బృహత్తర ప్రాజెక్టుగా పోలవరం - బనకచర్ల అనుసంధానం రూపు దిద్దుకుంటుందన్నారు. అలాంటి గొప్ప లక్ష్య సాధనకోసం జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు పల్నాడు ప్రజలు తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. పోలవరం- బనకచర్ల లింక్‌లో భాగంగా బొల్లాపల్లి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేపడతారని దాని ద్వారా తమ ప్రాంత ప్రజలకు తాగునీరు సాగు నీరుతో సమస్య తీరటంతోపాటు, భూగర్భ జలాలు కూడా భారీగా పెరుగుతాయని హర్షం వ్యక్తం చేశారు. అటు గోదావరి, ఇటు కృష్ణా నదుల జలాలతో రెండు పంటలు పండించుకుంటూ పల్నాడు ప్రాంతం సస్యశ్యామలం కానుందని, బీడు భూములు పచ్చటితోరణంలా మార నుందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందడంతో పల్నాడు ప్రాంతం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిందని, రూ.80వేల కోట్ల రూపాయలతో చేపట్టబోయే పోలవరం-బనకచర్ల భారీ ప్రాజెక్టు పూర్తయితే కరువు ప్రాంతాలైన పల్నాడు ప్రాంతంతో పాటు ప్రకాశం, రాయలసీమలకు నీటి సమస్య శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రాజెక్టుల రూపంలో రాష్ట్ర ప్రలజ సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ముఖ్య మంత్రి చొరవకు పల్నాడు ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారన్నారు.

భార్య మృతి తట్టుకోలేక భర్త మరణం





మృతిచెందిన ఆశీర్వాదం, సామ్రాజ్యం (ఫైల్)

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 8: భార్య మరణం తట్టుకోలేక మనోవేదనకు గురై గుండె పోటుతో భర్త మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గత కొంత కాలంగా పట్టణంలోని నిడుబ్రోలులో అన్నవరపు ఆశీర్వాదం(85), అన్నవరపు సామ్రాజ్యం(76) దంపతులు నివసిస్తున్నారు. ఆశీర్వాదం ఆర్మీలో పని చేసి పదవీ విరమణ చేశారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా ఇద్దరు కుమారులు గతంలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆశీర్వాదం, సామ్రాజ్యం దంపతులు అనారోగ్యం బారిన పడ్డారు. సామ్రాజ్యం పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందింది. భార్య మరణంతో తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం తెల్లవారుజామున ఆశీర్వాదం కూడా గుండెపోటుతో మరణించాడు. దంపతుల మృతి వార్త తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మృతుల బంధువులను ఫోన్‌లో పరామర్శించారు. టీడీపీ నాయకులు జాగర్లమూడి సుధీర్, పొన్నగంటి వాసు, ఆరే ప్రసాద్, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, సీతారామయ్య, వెంకటేశ్వరరావు, అహ్మద్‌ఖాన్ తదితర టీడీపీ నాయకులు దంపతుల మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుంటూరు మీదుగా హుబ్లీ, కతిహార్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా హుబ్లీ, కతిహార్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07325 హుబ్లీ - కతిహార్ ప్రత్యేక రైలు ఈ నెల 9 నుంచి 30వ తేదీ వరకు ప్రతీ బుధ వారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి గుంటూరు మీదుగా గురువారం వేకువజామున 3.20కి గుంటూరు, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కతిహార్ చేరుకుంటుంది. నంబరు. 07326 కతిహార్ - హుబ్లీ రైలు ఈ నెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతీ శనివారం మధ్యాహ్నం మధ్యాహ్నం 2.15కి బయలుదేరి ఆదివారం రాత్రి 9.10కి గుంటూరు, సోమవారం ఉదయం 10.50కి హుబ్లీ చేరుకుంటుందని శ్రీధర్ తెలిపారు.

డెలివరీ బాయ్స్ వివరాలను.. ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ డెలివరీ బాయ్స్ తమ వివరాలను ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని 18-59 మధ్య వయస్సు కల్గిన వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ సభ్యత్వం పూర్తిగా ఉచితమన్నారు. వివరాలకు 94925 55164 నెంబరును సంప్రదించాలన్నారు.

టూరిజం మార్కెటింగ్,కమ్యూనికేషన్స్ అధికారిగా పద్మారాణి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నాదెండ్ల ఎంపీడీవో ఎస్ పద్మారాణి ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ అధికారిగా నియమితులయ్యారు. డిప్యూటేషన్‌పై ఆమె అక్కడ పనిచేయనున్నారు. పద్మారాణిని జడ్పీ సీఈవో వీ జ్యోతి బసు విధుల నుంచి రిలీవ్ చేశారు.

జనరేటర్ తగిలి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి), ప్రమాదవశాత్తు జనరేటర్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని అల్లం సెంటర్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు. పట్టణంలోని శివ సంజీవ కాలనీకి చెందిన వై రామకోటేశ్వరరావు (46) మోటార్ సైకిల్‌పై ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళుతున్నాడు. బస్టాండ్ వైపు నుంచి టాటా ఏస్ వాహనానికి జనరేటర్ తగిలించుకొని వస్తున్నారు. టాటా ఏస్ వాహనం నుంచి జనరేటర్ ఊడి ఎదురుగా వస్తున్న రామకోటేశ్వరరావుకు తగిలింది. తలకు తీవ్ర గాయం అవ్వడంతో రామ కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మొదటి పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సఖీవన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఆశ్రయం పొందుతున్న వారిలో ఆత్మస్థైర్యం నింపాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సఖీవన్‌స్టాప్ సెంటర్‌లో ఆశ్రయం పొందుతున్న బాధిత మహిళలలో ఆత్మస్థైర్యం నింపాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల పట్టణంలోని అక్బర్‌పేటలోగల సఖీవన్‌స్టాప్ సెంటర్‌ను కలెక్టర్ మంగళవారం ఆకస్మికతనిఖీ చేశారు. సెంటర్‌ను తనిఖీ చేసిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. గృహహింస నుంచి రక్షణ కోరివచ్చే బాధిత మహిళలకు సఖీవన్‌స్టాప్ సెంటర్ రక్షణకవచంలా ఉండాలని చెప్పారు. జిల్లాలో ఏర్పాటైన సఖీవన్‌స్టాప్‌సెంటర్ మహిళలకు ఎంతో ఉపయుక్తమన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ఓ బాధిత మహిళతో కలెక్టర్ మాట్లాడారు. న్యాయసలహాలు, సేవలు, వసతిసౌకర్యాలు, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. ఇక్కడ 14 పోస్టులలో 11 మాత్రమే భర్తీకాగా ఒక్కొక్కరిని పిలిచి వారి విధుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు గైర్హాజరు కావటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ డి.రాధామాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి : కలెక్టర్

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రగతిలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవటానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఆర్థిక సంవత్సరంలో 10వేల కుటుంబాలకు పాడిపశువులను అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించారని తెలిపారు. లబ్ధిదారులకు స్త్రీనిధి ఉన్నతి, బ్యాంక్ లింకేజి ద్వారా రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటితొట్టెల నిర్మాణ లక్ష్యాలను ఈనెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులు,హెల్త్‌పెన్షన్‌ల విషయమై డీఆర్‌డీఏ పీడీతో కలెక్టర్ మాట్లాడి ఆరాతీశారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో 10వేల ఎకరాలలో పశుగ్రాసం పెంచేందుకు లక్ష్యంగా నిర్దేశించిందని ఆయన తెలిపారు. ఇందుకోసం జిల్లాలో ఒక్కొక్క పంచాయతీ నుండి 50 ఎకరాలు చొప్పున తీసుకోవాలని డీఆర్‌డిఏ పీడీని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు సదరు స్థలాలను అప్పగించాలన్నారు. ఆ స్థలంలో పెరిగిన గడ్డిని ప్రతి ఇంటికి అందజేసి నామమాత్రంగా డబ్బు వసూళ్ళు చేస్తారని తెలిపారు. ఆ డబ్బును సంఘాల అవసరాలకు వాడుతారన్నారు. ఇందు కోసం రెవెన్యూశాఖ, వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ, ఎంపీడీవోలు, ఎల్‌డీఎం, జీఎండీఐసీ, ఎన్‌ఆర్‌ఇజీఎస్, డిప్యూటీ జడ్పీసీఈవో, హార్టికల్చర్ ఏడీ, డీపీవోలతో సమన్వయం చేసుకొని ఒక ప్రణాళిక తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు.

● అన్న క్యాంటీన్‌ల నిర్వహణపై మున్సిపల్ అధికారులతో కలెక్టర్ ఆరా తీశారు. అన్న క్యాంటీన్‌కు వచ్చే వారి నుంచి ప్రజాభిప్రాయం సేకరించాలన్నారు. గ్రామాలలో, పట్టణాలలో శానిటేషన్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కవాచ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

● మెరైన్, తాలూకా సీఐలు లక్ష్మారెడ్డి, శ్రీనివారావు



సిబ్బందికి సూచనలు చేస్తున్న మెరైన్, తాలూకా సీఐలు లక్ష్మారెడ్డి, శ్రీనివారావు

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కవాచ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని మెరైన్, తాలూకా సీఐలు లక్ష్మారెడ్డి, శ్రీనివాసరావు తెలిపారు. బుధ, గురువారాలలో సూర్యలంక సముద్రతీరంలో మాక్ డ్రిల్‌గా నిర్వహించే సాగర్ కవాచ్ డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. కోస్టర్ సెక్యూరిటి ఎక్సర్‌సైజు పేరుతో నిర్వహించే సాగర్ కవాచ్ ముఖ్యఉద్దేశ్యం ప్రాదేశిక జిల్లాలోకి, సరిహద్దులు దాటి చొరబాటుదారులు రాకుండా నియంత్రించటం, మనభూభాగంలోకి ఉగ్రవాదులు ప్రవేశించకుండా, దాడి చేయకుండా మన ఆస్తులను మనం కాపాడుకోవటమన్నారు. బ్లూఫోర్స్ విధులలో భాగమైన ఇండియన్ నావీ, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులను అప్రమత్తం చేయటమన్నారు. ఈ సాగర్ కవాచ్ ఎక్సర్‌సైజు బుధవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమై గురువారం సాయంత్రం వరకు జరుగుతుందన్నారు. ఈ విషయమై మంగళవారం మెరైన్ పోలీసుస్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పి.శివనాగిరెడ్డి, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్‌లో బాపట్ల కానిస్టేబుల్ ప్రతిభ

● అభినందించిన ఎస్పీ



నాగబ్రహ్మారెడ్డిని మెడల్‌తో అభినందిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలలో బాపట్ల కానిస్టేబుల్ సత్తాచాటాడు. మెడల్స్ సాధించిన కానిస్టేబుల్ నాగబ్రహ్మారెడ్డిని మంగళవారం ఎస్పీ తుషార్ డూడి అభినందించి మెడల్స్‌తో సత్కరించారు. చందోలు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా చేస్తూ స్విమ్మింగ్‌లో రాణించటం జరిగిందన్నారు. విజయవాడలో నిర్వహించిన 25వ కృష్ణా రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీలలో పిట్టు నాగబ్రహ్మారెడ్డి సత్తాచాటాడు. గత నెల 24 నుంచి 28వ తేదీ వరకు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన 72వ ఆలిండియా పోలీసు ఆక్వాటిక్స్ క్లస్టర్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని సత్తా చాటారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

పంట సరళిలో మార్పులు చేసుకోవాలి

● డాక్టర్ జి.శివన్నారాయణ



మాట్లాడుతున్న డాక్టర్ జి.శివన్నారాయణ

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంట సరళిలో మార్పులు చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం విస్తరణ విభాగ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ తెలిపారు. బాపట్ల పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజి సెంటర్‌లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఏరువాక కేంద్ర జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కృష్ణా జోన్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహసంచాలకులు డాక్టర్ ఎంవీవీ దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బాలమురళిధర్‌నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఖరీఫ్, రబీ కాలాలలో చేపట్టిన కార్యక్రమం వివరాలను వివరించారు. డాక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ రైతులు ముందస్తు ప్రణాళికతో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉషా, డాక్టర్ రత్నకుమారి, ఉద్యానవనశాఖాధికారి జెన్నెమ్మ, వివిధ వ్యవసాయ కేంద్రాల శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు చేశారు.

సాగు నర్సరీ మేనేజ్‌మెంట్‌పై క్షేత్రప్రదర్శన

బాపట్లరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలో డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల, ప్రొటెక్ట్ సంస్థ వారు అఖిల భారత వ్యవసాయ పరిశోధన గిరిజన ఉప ప్రణాళిక సౌజన్యంతో హైడ్రోఫోనిక్ సాంకేతిక సాగు, నర్సరీమేనేజ్‌మెంట్‌పై క్షేత్ర ప్రదర్శన శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బాపట్ల ఎంపీపీ చినపోతుల హరిబాబు మాట్లాడుతూ స్టూవర్టుపురంలో అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కళాశాల వారు హైడ్రోఫోనిక్ సాంకేతిక సాగుపై ప్రదర్శన కల్పించటం గొప్పవిషయమన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ మాట్లాడుతూ ఎస్టీ రైతులకు, గృహిణులకు, నిరుద్యోగ యువతకి హైడ్రోఫోనిక్స్ అనే మట్టిలేని సాగుపై అవగాహన కల్పించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో స్టూవర్టుపురం ఉపసర్పంచ్ రాము, రైతులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

● క్రిస్టియన్‌పేటలో మనవార్డు-మన ఎమ్మెల్యే



రామకృష్ణపురంలో డ్రెయినేజీలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. పట్టణంలోని 2వ వార్డు రామకృష్ణాపురం, క్రిస్టియన్‌పేట పరిసరాలలో మంగళవారం ఆయన మనవార్డు-మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, కూటమిశ్రేణులతో కలిసి వార్డులో ప్రతివీధికెళ్ళి ఆప్రాంత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించ తగినవి తక్షణమే పరిష్కరించి మిగిలిన వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ నిరంతరం వార్డులు, గ్రామాలలో పర్యటించి బాపట్లను మంచి పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమానికి అపూర్వ స్పందన వస్తుందన్నారు. ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆప్రాంత ప్రజలకు తెలిపారు.

క్రిస్టియన్‌పేట వాసులకు శ్మశానవాటిక లేక ఇబ్బందిపడుతున్నామని పెద్దలు జిజె జయకర్, వై.ఏబు, క్రిష్టాఫర్‌లు సంఘస్తులతో కలిసి ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే పరిశీలిస్తానని హామి నిచ్చారు. రామకృష్ణాపురంలో డ్రైనేజీలు ఏర్పాటు చేసి రోడ్డునిర్మించాలని షేక్.నాగూర్‌కు విజ్ఞప్తి చేశారు. నివేశన స్థలం ఇచ్చి ఇల్లు, పెన్షన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేను అనారోగ్యానికి గురైన కూరాకుల విజయలక్ష్మి కోరారు. పార్టీసీనియర్ నాయకురాలు షేక్.నజీర భర్త అనారోగ్యంతో ఉన్నాడని ముఖ్యమంత్రి సహాయనిధి ఇప్పించాలని ఎమ్మెల్యేను వేడుకుంది. గతంలో రాజీవ్‌గృహకల్పన కింద నిర్మించిన అపార్ట్‌మెంట్‌లు పనికిరాకుండా ఉన్నాయని, వాటిని పూర్తి చేయించి లబ్ధిదారులకు ఇప్పించాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, వార్డు నాయకులు అంకాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, కూచిపూడి శ్యామ్ సుందర్, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, రమాదేవి, నజ్మా, జి.గిరిజారాణి, కంకణాల బాలమ్మ, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ లక్ష్మీనారాయణ, చాపల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఆర్‌వో జబ్బార్, ఏఈ ప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా కాల్వల మరమ్మతులు చేయాలి

గత ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన కాల్వలను ప్రణాళిక బద్ధంగా మరమ్మతులు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఈ విషయమై మంగళవారం జలవనరులశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టే పంట కాల్వలు, డ్రైనేజీల మరమ్మతులపై చర్చించారు. నియోజకవర్గంలో టెండర్లు పిలిచిన పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్‌ఈ వెంకటరత్నం, డీఈలు, ఏఈలు, నీటిసంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రూ.15లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణం

మౌలిక వసతుల రూపకల్పనే ధ్యేయంగా అవసరమైన ప్రతిచోట ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. పట్టణంలోని 5వ వార్డులో రూ.15 లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ పరిశా రమేష్‌గౌడ్, అంకాల శ్రీనివాసరావు, గోపాళం బుజ్జి, జనసేన నాయకులు బండి రామ్మూర్తినాయుడు, జి.గిరిజారాణి, మందపాటి ఆంద్రేయ, వడ్లమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి ఘటనపై స్పందించిన ఎస్టీ కమిషన్

● సమగ్ర నివేదిక ఇవ్వాలని చైర్మన్ డాక్టర్ శంకరరావు ఆదేశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా పరిధిలోని ఎలిసేటి దిబ్బకు చెందిన కొంతమంది వ్యక్తులు తమతో ఏళ్ల తరబడి వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని రేపల్లె మండలం బొబ్బర్లంకకు చెందిన ఎస్టీ దంపతులు నంబూరు అగ్ని, పద్మలు సోమవారం కలెక్టర్ వెంకటమురళికి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన ఆయన సత్వర విచారణకు ఆదేశించారు. ఈ ఉదంతం రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి కూడా వెళ్లడంతో చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు మంగళవారం స్పందించారు. బాధితుల గోడు విన్న వెంటనే విచారణకు ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళికి అభినందనలు తెలపడంతో పాటు సమగ్ర వివరాలతో నివేదిక అందించాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు

రచయిత సుందరాచారికి ఘన నివాళి

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గేయకవి పద్యకవి, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీత రచయితగా శంకరంబాడి సుందరాచారి గుర్తింపు పొందారని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు మంగళవారం సుందరాచారి 48వ వర్ధంతి కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా స్కూల్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి అందులో ఇమడలేక కవిగానే వ్యాపకం కొనసాగిస్తూ మంచి గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావులు సుందరాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీరామనవమి ఉత్సవాలలో కూచిపూడి నాట్యప్రదర్శన

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రథం బజారు సెంటర్‌లో శ్రీ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రామనవమి ఉత్సవాలలో భాగంగా శ్రీ వైష్ణవి కూచిపూడి నాట్య కళానికేతన్ వారిచే కూచిపూడి నాట్యప్రదర్శన ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 108 హనుమాన్ చాలీసాపారాయణం గావించారు. రాత్రి శ్రీరామ కోలాట భజన బృందంవారిచే కోలాటప్రదర్శన నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా చొప్పకట్ల వైష్ణవి, జస్విశ్రీ, డాక్టర్ శ్వేతుమాధవి శిష్యబృందంతో నృత్యప్రదర్శన నిర్వహించగా ఆహూతులను విశేషంగా అలరింపచేసింది. కార్యక్రమంలో బురుగుల సంగమేశ్వరశాస్త్రి వల్లూరి భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణగావించారు.

శ్రీ సీతారాములస్వామికి విశేష పూజలు

కర్లపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి వేడుకలలో భాగంగా కిరాణా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో శ్రీసీతారాములకు నందిపాటి నాగమల్లేశ్వరరావు, సామా దుర్గాప్రసాద్ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరపూజ, నవగ్రహ, అష్టోత్తర పూజలు, అర్చన, హారతి, నీరాజనం, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఊటుకూరి శ్రీనివాసరావు, రమేష్, నరేంద్ర, సుబ్బారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఈ

బాపట్లరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండల పరిధిలోని గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్‌శాఖాధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో బాపట్ల విద్యుత్‌శాఖ ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ జి.భాస్కరరావు, విజిలెన్స్ శాఖాధికారి ఆర్.విజయశ్రీనివాస్ ఆధ్వర్యంలో 40 బృందాలుగా ఏర్పడి 1176 గృహ, వాణిజ్య సర్వీస్‌లు, రెండు పరిశ్రమ సర్వీస్‌లను తనిఖీ చేశారు. వాటిలో 134 సర్వీస్‌లు అనుమతించిన లోడ్ కంటే అదనపులోడ్ వాడినందుకు రూ.6.7 లక్షల అపరాధ రుసుం విధించారు. విద్యుత్ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఆపరేషన్ ఏడీఈ టి.శ్రీనివాసరావు, రూరల్ ఏఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జిల్లెళ్ళమూడి అమ్మ జయంతి

బాపట్లరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లెళ్ళమూడి అమ్మ 103వ జయంతి వేడుకలను మంగళవారం శ్రీవిశ్వజననీ పరిషత్ ట్రస్ట్ సభ్యులు, భక్తులు వైభవంగా నిర్వహించారు. జిల్లెళ్ళమూడి, విశాఖపట్టణం, శృంగవరపుకోట మొదలైన చోట్ల గల అమ్మ ఆలయాలలో అభిషేకాలు, పూజలు, అన్నవితరణ నిర్వహించారు. శ్రీవిశ్వజననీ పరిషత్‌ట్రస్ట్, శ్రీవిశ్వజననీ పరిషత్ టెంపుల్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లెళ్ళమూడిలోని అమ్మ ప్రధాన ఆలయంలో తెల్లవారుజామున 103 జేగంటలతో సాంప్రదాయకంగా మేలుకొలుపు, 11 మంది రుత్వికులతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగాయని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి : సీపీఎం

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పెంచిన గ్యాస్‌బండ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య, కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఈవిషయమై మంగళవారం బాపట్ల పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ బండకు రూ.50 పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

అమృతలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి మంగళవారం సందర్శించారు. వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో రీ సర్వే, భూమి శిస్తు వసూలు వేగవంతం చేయాలని వీఆర్వోలను ఆదేశించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, డిప్యూటీ తహసీల్దార్ శివయ్య తదితరులు ఆమె వెంట ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఏలీషాబాబు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎ.ఏలీషాబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఐ.సత్యనారాయణరావు ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు సెలవులో ఉన్నారు.

కరాటే టోర్నమెంట్‌లో ఫోర్‌ఫ్రంట్ విద్యార్థులకు పతకాలు

కొల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సౌత్ ఇండియా కరాటే టోర్నమెంట్‌లో ఫోర్‌ఫ్రంట్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు కరాటే శిక్షకులు పులివర్తి సోమయ్య మంగళవారం తెలిపారు. కొల్లూరు ఫోర్ ఫ్రంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు గుంటూరులో ఆదివారం జరిగిన మూడవ సౌత్ ఇండియా 2025 ఫ్రెండ్‌షిప్ కరాటే టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. టీమ్ కటా విభాగంలో మొదటి బహుమతి, మరో రెండు టీమ్‌ల విద్యార్థులు రెండవ బహుమతిని సాధించినట్లు శిక్షకులు తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం బహుమతులు సాధించిన 9 మంది విద్యార్థులను, శిక్షకుడిని విద్యా సంస్థ డైరెక్టర్ నవీన్‌పాల్, ప్రిన్సిపల్ అనీతరాజన్, ఉపాధ్యాయులు అభినందించారు.

చేనేత సహకార సంఘాల బకాయిలు విడుదల చేయాలి

చెరుకుపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు జరపాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చెరుకుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ సీహెచ్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మిక సంఘాలకు ప్రకటించిన త్రెఫ్ట్‌ఫండ్‌ను వెంటనే విడుదల చేయాలని, గత ప్రభుత్వం బకాయిపెట్టిన తుది విడత వర్క్‌షెడ్ల బిల్లు రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఇవ్వవలసిన రూ.156 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సంఘ ఉపాధ్యక్షుడు దీపాల సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల నాగమురళీకృష్ణ, రాజోలు సహకార సంఘం మాజీ మేనేజర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

రేపల్లె, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా గతం ఎంతో ఘనకీర్తికలవాడా అనే గేయాన్ని రచించి తెలుగుప్రజల ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయులు వేములపల్లి శ్రీకృష్ణ అని సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో సీపీఐ నాయకుడు శ్రీకృష్ణ 25వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి చుక్కాకుల శివశంకర్, సిరంశెట్టి శ్రీనివాసరావు, శివరామకృష్ణ, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రామకోటేశ్వరరావుకు నివాళులు

సీపీఐ సీనియర్ నాయకుడు మేకా రామకోటేశ్వరరావు 11వ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శి చుక్కాకుల శివశంకర్ మాట్లాడుతూ పాత రేపల్లె తాలూకా పేదలకు నివేశన స్థలాల కోసం, రైతాంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలు మరువలేనివన్నారు.

మృతుడి కుటుంబానికి టీడీపీ నాయకులు ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పల్లెకోనలో కొక్కిలిగడ్డ ప్రకాశరావు (55) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని గ్రామ టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ఆనందబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు మృత దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ రాయన ప్రసాద్, మాజీ ఎంపీపీ వేజండ్ల సతీష్, సూరేపల్లి సొసైటీ డైరెక్టర్ వేజండ్ల సోమశేఖర్, పార్టీ నాయకులు నవీన్, దేవదాసు, వరప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న అనగాని శివప్రసాద్

విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

రేపల్లె, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో ఫ్రీ పాలిటెక్నికల్ కోచింగ్ విద్యార్థులకు మంగళవారం పుస్తకాలను అందించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని, వారి ఆశలకు అనుగుణంగా విద్యలో రాణించి వారికి ఆసరాగా ఉండాలని కోరారు. పాలిటెక్నికల్ కళాశాల నిర్మాణం కోసం మంత్రి అనగాని కృషి చేశారని, అన్ని వసతులతో కూడిన పక్కా భవనాన్ని నిర్మించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు కె.మల్లికార్జున్‌రావు, వి.సంధ్యారాణి, ఏపీ బాలశంకర్ పాల్గొన్నారు.

12న జాతీయ లోక్ అదాలత్


రేపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌లో సత్వరమే కేసులకు పరిష్కారం దొరుకుతుందని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కోర్టులో ఈనెల 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తుండటంపై పోలీస్ శాఖలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేసులు సివిల్, క్రిమినల్, ప్రీలిటికేషన్ కేసులను ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైతే లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.రూపశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ గిరిధరరావు, సెక్రటరీ శ్రీనివాసరావు, డీఎస్పీ ఆవుల సాంబశివరావు, సీఐలు మల్లికార్జున్‌రావు, సురేష్‌బాబు, సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆధ్వర్యంలో పబ్లిక్ గ్రీవెన్స్ సెల్

● హాజరుకానున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వేమూరు పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు పబ్లిక్ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు బాపట్ల పార్లమెంటరీ స్థాయి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరవుతారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధి గ్రామాల్లో ఉన్న ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు అందజేసి వాటిని పరిష్కరించుకోవాలని కోరారు.

కేశవుని తాకిన సూర్యకిరణాలు



జంపని చెన్నకేశవాలయంలో మూలవిరాట్‌ను స్పృశించిన సూర్య కిరణాలు

వేమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీ భూసహిత శ్రీచెన్నకేశవస్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఏకాదశి పర్వదినాన ఉదయం 7.30 గంటలకు మూల విరాట్ స్వరూపం చెన్నకేశవుని సూర్యకిరణాలు తాకాయి. పాదాల నుండి కిరీటం వరకు ప్రతి అంగాన్ని తాకుతూ 40 నిమిషాలకు పైగా సూర్య భగవానుడు కేశవుని స్పృశించాడు. ఈ సుందరమైన అనుభూతిని కలిగించే దృశ్యాన్ని భక్తులు చూసి తన్మయం చెందారు. ఉత్తరాయణ పుణ్యకాలంలో తరచుగా స్వామి వారిపై సూర్యకిరణాలు పడుతుంటాయని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి సూర్య అష్టకం, పంచ సూక్తాలను పఠించి సూర్యునికి తర్పణలు వదిలారు.

పౌష్టికాహార పక్షోత్సవ ర్యాలీ



పౌష్టికాహార పక్షోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్, పంచాయతీ అధికారులు

కొల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహార పక్షోత్సవ ర్యాలీని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఏడవ పౌష్టికాహార పక్షోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి ప్లకార్డులు చేతబూని అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈవోపీఆర్డీ సునీత, కార్యదర్శి బి.మల్లికార్జున, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమృతలూరులో...

అమృతలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి అన్నారు. కూచిపూడిలో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, తల్లిదండ్రులతో ర్యాలీ చేశారు. సీడీపీవో మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయశ్రీ, భాగ్యలక్ష్మీ, గోవిందమ్మ, దుర్గ, విమల, రాణి తదితరులు పాల్గొన్నారు.



జంపనిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

గ్రామాల్లో పోషణ్ పక్వాడ ర్యాలీలు

వేమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధి గ్రామాల్లో పోషణ్ పక్వాడ ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మాధవి, మధురవాణిల పర్యవేక్షణలో 7వ పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా ర్యాలీలు నిర్వహించిన అనంతరం బాలింతలు, గర్భిణులు, తల్లుల సమావేశం నిర్వహించారు. పిల్లలకు పుష్టికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం జడ్పీటీసీ ఉదయభాస్కరి పోషణ్ పక్వాడ ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, ఐసీడీఎస్ ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. ఏసీడీపీవో విజయరాణి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం క్యాన్సర్ కారకమని, తల్లిపాలు బిడ్డలకు శ్రేష్ఠకరమని సూచించారు. అనంతరం కార్యకర్తలు గ్రామ పురవీధుల్లో పోషణ్ పక్వాడ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, సూపర్‌వైజర్ సంపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాల్లో సత్యనారాయణ స్వామి వ్రతం

వేమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామస్వామి వారి దేవస్థానంలో మూడు రోజులు దీక్షతో నిర్వహిస్తున్న వార్షిక శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. శైవ ఆగమ పండితులు స్వర్ణ నాగేశ్వరశర్మ ఆగమ శాస్త్ర ప్రకారం భరత శత్రుఘ్న హనుమ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారి మూలవిరాట్ స్వరూపాలకు విశేష పూజలు జరిపారు. అనంతరం సత్యదేవ వ్రతాన్ని నిర్వహించి భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

మిస్సింగ్ సిటిజన్స్.. గుర్తింపు



- ఎట్టకేలకు ఛేదించిన సచివాలయాల సిబ్బంది
- నాలుగు నెలల క్రితం మూడు జిల్లాల్లో 6.50 లక్షల అన్‌మ్యాపింగ్ ● ఇప్పటికే 6.45 లక్షల మందిని గుర్తించి సచివాలయాలకు మ్యాపింగ్
- ఇంకా 5 వేల మంది ఆచూకీ కోసం వెతుకులాట

గుంటూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో మ్యాపింగ్ జరగని పౌరులను గుర్తించి డేటా సేకరించాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఉమ్మడి గుంటూరు జిల్లాలో పూర్తిస్థాయిలో ఆచరణలోకి తీసుకొచ్చారు. కొంతమంది ఇక్కడి సచివాలయాల్లో ఏదో ఒక సర్వీసు పొంది శాశ్వతంగా వలస వెళ్లిపోయారు. సంపన్నుల నివసించే ప్రాంతాల్లోని ప్రజలు సచివాలయాల్లో మ్యాపింగ్ కావడానికి ఏమాత్రం ఇష్టపడటం లేదు. దీని వలన తమ గోప్యతకు భంగం వాటిల్లుతుందని చెబుతూ సర్వేకి వెళ్లిన సిబ్బందిని వెనక్కు పంపేస్తున్నారు. దీంతో మిస్సింగ్ సిటిజన్స్‌ని పట్టుకోవడం కష్టసాధ్యం కాగా వాళ్లని ఏదో ఒక విధంగా ఒప్పించి సమీపంలోని సచివాలయాలకు మ్యాపింగ్ చేశారు. దీంతో పెండింగ్ శాతం 96 నుంచి నేడు 1 శాతానికి తగ్గిపోయింది.

గుంటూరు జిల్లాలో 2 లక్షల 51 వేల 298 మంది పౌరుల యూనిక్ రికార్డులు కనిపించడం లేదు. అలానే పల్నాడు జిల్లాలో 2 లక్షల 2 వేల 328, బాపట్ల జిల్లాలో లక్ష 65 వేల 477 మంది డేటా అందుబాటులో లేదు. దాంతో ఎవరైతే మిస్సింగ్ సిటిజన్స్ ఉన్నారో వారి డేటాని ఇదివరకే సచివాలయాల లాగిన్‌లకు ప్రభుత్వం పంపించింది. ఆ డేటాని సంబంధిత సచివాలయాల కార్యదర్శులు తీసుకొని మిస్సింగ్ సిటిజన్స్ వద్దకు వెళ్లి వారి ఆధార్‌ల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన లింక్/యాప్‌లో నమోదు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. దీని ఫలితంగా ఇప్పటివరకు గుంటూరు జిల్లాలో 2,47,630 పల్నాడులో 2,01,004, బాపట్లలో 1,65,464 మంది మిస్సింగ్ సిటిజన్స్ గుర్తించి మ్యాపింగ్ చేశారు. దీంతో మ్యాపింగ్ ప్రక్రియ గుంటూరులో 1.46 శాతం, పల్నాడులో 0.65, బాపట్లలో 0.01 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నది.

సర్వేల పేరుతో తరచుగా వెళుతుండటంతో ప్రజలు అసహనం

కాగా సర్వేల పేరుతో గతంలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లేవారు. ఇప్పుడు ఆ పాత్రని సచివాలయాల కార్యదర్శులు, ఏఎన్ఎంలు పోషిస్తున్నారు. సర్వేకి వెళ్లిన ప్రతీసారి ఆధార్ నంబరు చెప్పమని కోరుతున్నారు. దాని ద్వారా వచ్చే ఓటీపీని చెప్పమంటుండటంతో తమ డేటా ఎక్కడ బయటకు లీకు అవుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలానే పోష్ ఏరియాల్లో నివసిస్తున్న వారిలో ఎక్కువమందికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందవు. దాంతో తామెందుకు సచివాలయాల్లో మ్యాపింగ్ చేసుకోవాలని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అపార్టుమెంట్‌లు, గ్రూపు హౌసింగ్‌లలోకి తరచుగా సర్వేల పేరుతో వెళ్లి సిబ్బంది విసిగిస్తుం డటం నివాసితులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల అయితే ఎంఎస్ఎంఈ, క్యాన్సర్ స్క్రీనింగ్, పీ4, వర్క్ ఫ్రం హోం వంటి 16 సర్వేలతో ప్రజల వద్దకు సి బ్బంది కొన్ని నెలల వ్యవధిలో వెళ్లారు. తరచుగా సర్వే పేరుతో వచ్చి ఏవేవో ప్రశ్నలు వేస్తూ విసిగిస్తుండటంతో తామెందుకు చెప్పాలని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తూ ఇందుకేనా తమని మ్యాపింగ్ చేసిందని ప్రశ్నిస్తున్నారు.



సేవలపై సంతృప్తి

ప్రభుత్వాస్పత్రి వైద్యసేవలపై పెరిగిన భరోసా!
- పనితీరుపై 74.14 శాతం, మందుల పంపిణీపై 79 శాతం సంతృప్తి
- ఐవీఆర్ఎస్ సర్వే ఫలితాలు వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి పని తీరుపై ప్రజల్లో మరింత భరోసా పెరిగింది. ఆసుపత్రి పనితీరుపై సుమారు 75 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల కిందట నిర్వహించిన సర్వేలో 61 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నిర్వహించిన ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఎస్ఆర్) నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. గతంలో జనవరి 27న, ఫిబ్రవరి 7న, మార్చి ఐదో తేదీన మూడు దఫాలుగా ఐవీఎస్ఆర్ ద్వారా ప్రభుత్వాస్పత్రి పని తీరును తెలుసుకున్నారు. తాజాగా ఏప్రిల్ 7న జరిపిన సర్వేలో గత మూడు సర్వేల కంటే ప్రజల్లో ప్రభుత్వాస్పత్రుల పనితీరుపై సానుకూలత పెరగడం విశేషం. సర్వే వివరాలను ప్రభుత్వం విడుదల చేసింది. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రితో పాటు రాష్ట్రంలోని ఇతర వైద్య బోధన ఆస్పత్రులు, జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రుల పనితీరును సర్వే ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు.

సర్వే వివరాలు

- ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని 74.14 శాతం మంది ప్రజలు తెలిపారు. గతంలో 66 శాతం మంది మాత్రమే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. తాజా సర్వేలో 12.33 శాతం మంది అధికంగా వైద్య సిబ్బంది పనితీరుపై సానుకూలత వ్యక్తం చేశారు.
- ఆసుపత్రిలో డాక్టర్లు రాసిన మందులు ఇస్తున్నారా అని ప్రశ్నించగా, 67.63 శాతం మంది ఇస్తున్నారని తెలిపారు. గతంలో 57 శాతం మంది మాత్రమే మందులు ఇస్తున్నాని తెలిపారు.
- ప్రభుత్వాస్పత్రిలో అవినీతి ఉందా? అని ప్రశ్నించగా, 41.17 శాతం మంది ఉన్నట్లు చెప్పారు. జనవరిలో నిర్వహించిన సర్వేలో 63 శాతం మంది ఆసుపత్రిలో అవినీతి ఉందని స్పష్టం చేశారు.
- ప్రభుత్వాస్పత్రిలో పారిశుధ్యంపై మాత్రం ప్రజలు పెదవి విరిచారు. గత సర్వేల్లో 60 శాతం మంది పారిశుధ్యం బాగానే ఉందని చెప్పగా, తాజాగా నిర్వహించిన సర్వేలో కేవలం 49 శాతం మంది మాత్రమే పారిశుధ్యంపై సంతృప్తి ప్రకటించారు.
- ఇక జిల్లాలో ప్రాంతీయ ఆసుపత్రుల పనితీరుపై కూడా సానుకూలత వ్యక్తమైంది. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని 74 శాతం మంది తెలిపారు. గతంలో కేవలం 47శాతం మంది ప్రజలు మాత్రమే వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నట్లు తెలిపారు.
- ఆసుపత్రుల్లో అవినీతి తగ్గిందన్న వారి సంఖ్య 41 శాతం నుంచి 61 శాతానికి పెరిగింది. డాక్టర్ రాస్తున్న మందులు ఇస్తున్నారని చెప్పిన వారి సంఖ్య 59 నుంచి 79 శాతానికి పెరిగింది.
- జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో పారిశుధ్యం బాగా ఉందని చెప్పిన వారు కేవలం 50 శాతం మంది మాత్రమే. గతంలో 67 శాతం మంది శానిటేషన్‌పై సంతృప్తి వ్యక్తం చేయగా, అది తాజా సర్వేలో 17 శాతం తగ్గిపోయింది.

'మన మోడల్' పాఠశాలగా మార్చుకుందాం

- చినకోంద్రుపాడులో గ్రామ పెద్దల వినూత్న కార్యక్రమం
- 75 మంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విల్లింగ్ లెటర్స్
- పాఠశాల దత్తతకు ముందుకు వచ్చిన పద్మజారాణి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిని నిలబెట్టుకునేందుకు గ్రామస్థులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి చదువు'కొనే' పరిస్థితుల నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విలువలతో కూడిన విద్యను పిల్లలకు అందించేలా ప్రయత్నాలు మొదలయ్యాయి. అందులో బాగంగానే ఇద్దరు, ముగ్గురు విద్యార్థులతో కునారిల్లుతున్న చినకోంద్రుపాడు మెయిన్ పాఠశాలకు ప్రాణం పోసేందుకు ఆ గ్రామానికి చెందిన పద్మజారాణి ముందుకు వచ్చారు. ఆమెకు చినకోంద్రుపాడులోని టీడీపీ నాయకులు ఊతం ఇవ్వడంతో కొద్ది రోజుల్లోనే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు అత్యంత ఆదరణ పెరిగింది. నెల రోజుల వ్యవధిలోనే వివిధ పాఠశాలలకు వెళ్లే సుమారు 75 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ బడికి తమ పిల్లలను పంపుతాం అంటూ విల్లింగ్ లెటర్స్ తీసుకుని విద్యాశాఖ అధికారులకు అందించారు.

గతంలో చినకోంద్రుపాడు మెయిన్ పాఠశాల ఎక్కువ మంది విద్యార్థులతో మోడల్ స్కూల్‌గానే ఉండేది. అయితే గత వైసీపీ హయాంలో 117 జీవో పుణ్యమా అంటూ 3, 4, 5 తరగతులు పక్కనే ఉన్న హైస్కూల్లో కలిసాయి. ఆ తరువాత నుంచి ఈ పాఠశాలలో ముగ్గురు, నలుగురు విద్యార్థులు మాత్రమే ఉంటూ వస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరంలో అసలు పిల్లలు ఉండే పరిస్థితి కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఈ పాఠశాలను ఈ ప్రభుత్వం పూర్తిగా బేసిక్ మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చింది. ఈ క్రమంలో గ్రామ పెద్దలు మోడల్ స్కూల్‌గా మార్చాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేయడం.. అరవై మంది విద్యార్థులు ఉంటే గాని మార్చడానికి వీలు పడదని చెప్పడంతో వారిలో ఆలోచన మొదలైంది. వెంటనే గ్రామానికి చెందిన పద్మజారాణితో పాటు, చినకోంద్రుపాడుకి టీడీపీ నాయకుడు సుబ్బారావు, జడ్పీ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణలు గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలో చదువుకునే విద్యార్థుల జాబితాను తయారు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకోవడం మొదలుపెట్టారు. ఇందుకోసం కొన్ని రోజులుగా గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రైవేటు పాఠశాలల కన్నా మిన్నగా తమ పిల్లలకు విద్యాబుద్దులు అందించే బాధ్యతను వీరు తీసుకున్నారు. అందరికృషితో ఇప్పటి వరకు వివిధ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే సుమారు 75 మంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విల్లింగ్ లెటర్స్ తీసుకుని మండల విద్యాశాఖ అధికారులకు అందించారు. రానున్న విద్యాసంవత్సరంలో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడితో పాఠశాల పూర్వ వైభవం సంతరించుకోనుంది.


గ్రామంలో పెద్దలతో కలిసి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పద్మజారాణి

పాఠశాల దత్తత కోసం అర్జీ పెట్టాను : పద్మజారాణి

ముఖ్యమంత్రి ఇచ్చిన పీ-4 పిలుపుతో పాఠశాలను దత్తత తీసుకునేందుకు ప్రభుత్వానికి అర్జీ పెట్టానని పద్మజారాణి తెలిపారు. సంవత్సర కాలంగా ముగ్గురు టీచర్లతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ట్యూషన్లు చెప్పిస్తు న్నామన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలను బతికించేందుకు తనవంతు చేయూత అందిస్తానన్నారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు వాహన సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తానని ఆమె తెలిపారు.

నటుడు.. నిర్మాత.. దర్శకుడు.. రచయిత.. బాలయ్య

- సినీ రంగంపై చెరగని ముద్ర
- ఆయన జీవితం గుంటూరుకే గర్వకారణం
- నేడు బాలయ్య జయంతి.... వర్ధంతి



గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పాత తరం సినీ నటు డు మన్నవ బాలయ్య 1930 ఏప్రిల్ 9న అమరావతి మండలంలోని చావపాడు గ్రామంలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం తెనాలి, మద్రాసు (ప్రస్తుతం చెన్నై)లో జరిగింది. చిన్ననాటి నుండి నాటకాలపై, నటనపై తీవ్రమైన ఆసక్తి కలిగి ఉండేవారు.

సినీ ప్రయాణం....

బాలయ్య 1953లో ఎత్తుకు పై ఎత్తు అనే చిత్రంతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. ఆయన సహాయ నటుడిగా, ప్రతినాయ కునిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగుతో పాటు తమిళ చిత్రాలలోనూ నటించారు. అత్యంత విలక్షణమైన నటనతో ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచారు. ఆయన 300లకు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. 1950 నుంచి 1990 వరకు తన నటనతో ఎన్నో అద్భుతమైన చిత్రాలలో నటించి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయారు.

ప్రముఖ చిత్రాలు......

ఆయన నటించిన ప్రముఖ చిత్రం మాయాబజార్. ఈ చిత్రంలో ఆయన చేసిన సహనటుడి పాత్ర ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది. లవకుశ, దేవత (ఓల్డ్), గుండమ్మ కథ, భక్త ప్రహ్లాదా, మరో చరిత్ర వంటి సినిమాలలో కూడా ఆయన మంచి పాత్రలు పోషించారు.. కేవలం పాతకాలపు చిత్రాలు కాకుండా, 1970, 1980 ల లోనూ మంచి పాత్రలు చేశారు.

నిర్మాతగా కూడా..

బాలయ్య అమృత ఫిలిమ్స్ పేరిట కొన్ని సినిమాలు కూడ నిర్మించారు. ఆయన నిర్మించిన సినిమాలలో నేరము- శిక్ష అత్యంత ప్రజాదరణ పొందింది.

పురస్కారాలు....

ఆయన నటనకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఎన్నో అవార్డులు అందుకున్నారు. నంది అవార్డు పురస్కారం కూడా ఆయనకు లభించింది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలకు అనేక అవార్డులు, సన్మానాలు లభించాయి.

మరణం

బాలయ్య 2022 ఏప్రిల్ 9న 92 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద లో టని చెప్పవచ్చు. ఆయన పుట్టిన తేదీ, మరణించినది ఏప్రిల్ 9నే కావడం విశేషం. బాలయ్య సినీ జీవితం నేటితరం నటులకు స్ఫూర్తిదాయకం.

ఎంఈవోల వసూళ్ల దందా

విధులు విస్మరించి ఇద్దరు అధికారుల ఇష్టారాజ్యం

గుంటూరు(విద్య),ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరు ఎంఈవోలకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలు వేరు..... ఒకరు పరిపాలనా పరమైన అంశాలకు పరిమితం కావాలని, మరొకరు ప్రభుత్వ పాఠశాలల పనితీరు నిత్యం పర్యవేక్షించి పాఠశాలల అభ్యున్నతికి కృషి చేయాలని, నిబంధనలు ఉల్లగించకుండా ప్రైవేటు పాఠశాలల్ని కట్టడి చేయాలనే విధులు ప్రధానమైనవి. అయితే ఈ విధుల్ని విస్మరించి ఇద్దరు ఎంఈవోలు ప్రైవేటు పాఠశాలల నుంచి, భారీ మొత్తాలు వసూళ్ళు చేయడమే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు ఉపాధ్యాయుల సర్వీస్ విషయాల్ని ఆర్థిక ప్రయోజనాలకు వాడుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదీ గుంటూరు డివిజన్‌లో కీలక నియోజవర్గంలో పనిచేసే ఇద్దరు ఎంఈవోలు చేస్తున్న వసూళ్ళదందా.

ప్రైవేటు పాఠశాలలకు టార్గెట్

నగరంలోని చిన్నా, పెద్ద ప్రైవేటు పాఠశాలలు దాదాపు 150పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్ని ఆకస్మిక తనిఖీ చేయడం అక్కడ నిబంధనలు సరిగా పాటించడం లేదని, పారిశుధ్యం, తాగునీరు, ఉపాధ్యాయులకు సరైన అర్హత లేవనే కారణాలు చూపి భారీ మొత్తంలో ఇద్దరు ఎంఈవోలు దండుకుంటున్నారు. వాస్తవంగా ఇందులో ఒక ఎంఈవో పరిపాలనకే పరిమితం కావాల్సి ఉండగా లేని అధికారాలతో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- ఇటీవల గుంటూరు రూరల్ మండల పరిధిలోని ఓ పాఠశాలకు తనిఖీ కోసం వెళ్ళి చిన్న చిన్న కారణాలు చూపి రూ. 15వేలు ఫైన్ వేశారు. దీంతో సదరు పాఠశాల యాజమాని లబోదిబోమంటూ విద్యాశాఖలోని అధికారుల ముందు తమ గోడు వెళ్ళబోసుకున్నారు.
- నగర పరిధిలోని మరోస్కూల్‌కు తనిఖీలకు వెళ్ళి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఇద్దరు ఎంఈవోలు తమ వద్ద పనిచేసే సీఆర్‌పీలను వసూళ్ళ కోసం వాడుకుంటున్నారు. ప్రతిరోజు సీఆర్‌పీలకు టార్గెట్లు పెట్టి ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల నుంచి రూ. 10వేల నుంచి రూ. 20 వేల వరకు విద్యార్థుల సంఖ్యను బట్టి వసూళ్ళు చేస్తున్నారు.
- నగర పరిధిలోని జడ్పీ, మున్సిపల్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీఇంబర్స్‌మెంట్ తదితర సర్వీసులకు సంబంధించిన ఫైల్స్ క్లియర్ చేయాలన్నా భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నారు.
- నగర పరిధిలోని ఎయిడెడ్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయుల సర్వీస్ మ్యాటర్స్ విషయంలోనూ వసూళ్లు అపడం లేదు. ఓ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడికి సంబంధించి పెన్షన్ రికార్డుల కోసం దాదాపు రెండు నెలల నుంచి సంబంధిత కుటుంబ సభ్యులు ఎంఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.
- ఇద్దరు ఎంఈవోల్లో ఒకరు పాఠశాల హెచ్ఎంగా రెగ్యు లర్‌గా పనిచేస్తూ ఎంఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పాఠశాల హెచ్‌ఎం బాధ్యతల్ని ఇతరులకు అప్పగించి ఆయన వసూళ్ళకే పరిమితం అవుతున్నారని, కనీసం పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌కూడా పర్యవేక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్.....

తన నియోజక వర్గంలో పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తికి ఎంఈవో బాధ్యతల నుంచి తప్పించాలని నగర పరిధిలోని ఓ ఎమ్మెల్యే విద్యాశాఖకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. అయితే ఆయన లేఖను విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎంఈవోగా కొనసాగడానికే సదరు హెచ్‌ఎం ఆసక్తి చూపుతున్నాడని, ఇందుకోసం ఉన్నత స్థాయిలో పైరవీలు సాగిస్తున్నట్లు విద్యాశాఖలో ప్రచారం సాగుతోంది.

సమ్మె బాటలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

- డీఎంహెచ్‌కు నోటీసు అందజేత

గుంటూరు సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో)లు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని కలిసి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు టీ ప్రవళిక మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి వెళ్తున్నామన్నారు. ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారిని క్రమబద్ధీకరిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిన మీదటే తాము ఈ ఉద్యోగాల్లో చేరామని తెలిపారు. అయితే ఆ విషయం గురించి అడుగుతుంటే అధికారులు సరిగా పట్టించుకోవటం లేదని, జీతాల పెంపు విషయంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ఎఫ్ఆర్ఎస్ పేరుతో తీవ్రంగా వేధిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి 24వ తేదీ వరకు వివిధ స్థాయిల్లోని అధికారులకు నోటీసులు అందజేసి ఆ తర్వాత సమ్మె చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 16 వ తేదీ నుంచి ఆన్‌లైన్ సేవలు నిలిపివేయడం ద్వారా నిరసన కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. డీఎంహెచ్‌వోకి నోటీసు అందజేసిన వారిలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పల్లపాటి లింగరాజు, కే సృజన, దీక్షత, అబ్బుస్ తదితరులు ఉన్నారు.


డీఎంహెచ్‌వో విజయలక్ష్మికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

బస్టాండ్‌లో ధరల దోపిడీ

- గుంటూరు డిపోలో ఎమ్మార్పీ ఉల్లంఘనలు
- దుకాణాల వద్ద కనిపించని ధరల పట్టికలు
- తాగునీటినీ ప్రయాణికులు కొనుగోలు చేయాల్సిందే...

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు దోపిడీకి గురవుతు న్నారు. కొన్ని తినుబండారాల స్టాల్స్‌లో ఎమ్మా ర్పీను ఉల్లంఘిస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఇటీవల ఆర్టీసీకి చెందిన ఓ యూని యన్ నాయకుడే ధరల దోపిడీకి గురై అధికా రులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఆ దుకాణదా రుడుకి అధికారు జరిమానా విధించారు. అధికా రులు ఉదాసీన వైఖరి కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి బస్టాండ్‌లో స్టాల్స్ యజమాను లకు అనువుగా మారిందన్న విమర్శలు వినిపి స్తున్నాయి. వాస్తవానికి ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో స్టాల్స్‌లో ధరలు పట్టిక రూపంలో ఏర్పాటు చేయాలి. టెండర్‌లో పేర్కొన్న వస్తువులను మా త్రమే సదరు స్టాల్స్‌లో విక్రయించాల్సి ఉంటుం ది. అయినప్పటికీ అటువంటి నిబంధనలు ఏమి అక్కడ అమలు కావటం లేదు. కొన్ని వస్తువు లకు అనుమతులు తీసుకుని అదనపు వస్తువు లను సైతం విక్రయిస్తున్నారన్న విమర్శలు విని పిస్తున్నాయి. కొందరు స్టాల్స్ యాజమానులతో అధికారులు కుమ్మక్కై పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులూ లేకపోలేదు. రూ. 25ల కూల్ డ్రింక్స్ బాటిల్‌ను రూ. 30లు వసూ లు చేస్తున్నారు. ఇక వాటర్ బాటిల్స్‌లోనూ అంతే అదనంగా వసూలు చేస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఫిర్యాదు లు వెల్లువెత్తుతున్నాయి. ఇక బస్టాండ్‌లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం.. ఎండలు మండుతుండటంతో తాగునీరు కూడా వేడిగా ఉండటంతో ప్రజలు చేసేది లేక స్టాల్స్‌లో వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తున్నారు. నాసిరకం కంపెనీల వాటర్ బాటిల్స్ పెట్టి ధరలు మాత్రం బ్రాండెడ్ వాటర్ బాటిల్స్ ధరలనే వసూలు చేస్తున్నారు. బస్టాండ్‌లో గతంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌లు మూలన పడటంతో పట్టించుకునే నాథుడే లేడు.

కనిపించని తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీలు

బస్టాండ్‌లో గతంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలతో అప్రమత్తం చేసే వారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. తూనికలు, కొలతల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇక బస్టాండ్‌లోనూ నిరం తరం పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ ట్రాఫిక్ మేనే జర్ (ఏటీఎమ్) ఇన్‌ఛార్జ్ డిప్యూటీ సీఎమ్‌వోగా వ్యవహరిస్తున్నారు. దీంతో బస్టాండ్‌లో సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని ఓ స్టాల్

వినియోగదారులకు కేంద్రం షాక్

గ్యాస్ సిలిండర్ ధర పెంపు

ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి రూ.200 నుంచి భారం

ఏడాదికి జిల్లా ప్రజలపై రూ.15కోట్ల మేర భారం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంట గ్యాస్ వినియోదదారులకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌కు ఒక్కసారిగా రూ 50 పెంచడంతో ప్రజానీకంపై భారీగా భారం పడనుంది. ధరలు పెంచిన వెంటనే వినియోగంలోకి తీసుకురావడంతో మరింత ఆందోళన నెలకొంది. జిల్లావ్యాప్తంగా మూడు కంపెనీల పరిధిలో సుమారు 7.5 లక్షల గ్యాస్ సిలిండర్లు ఉన్నాయి. ఒక్కొక్క కుటుంబం ఏడాదికి నాలుగు సిలిండర్ల వరకు వినియోగిస్తారు. అలా ఒక్కొక్క కుటుంబంపై ఏడాదికి రూ.200 వరకు ఖర్చు పెరగనుంది. ఆ విధంగా జిల్లావ్యాప్తంగా ప్రజానీకంపై ఏడాదికి రూ.15కోట్ల మేర భారం పడనుంది.

జిల్లాకేంద్రమైన ఒంగోలులో సోమవారం సిలిండర్ ధర రూ.848 ఉండగా మంగళవారం ఆ ధర రూ.898కి చేరింది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏప్పుడు ధరలు పెరుగుతాయో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పుడు కూడా ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ ప్రజలపై ఆర్థికభారం మోపుతుండటంతో ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం నూతన కమిటీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ పశుసంవర్ధశాఖ ఆఫీసర్స్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పశుసంవర్ధక శాఖ సమావేశపు హాలులో మంగళవారం జరిగిన ఎన్నికలకు డాక్టర్ టి.మోహన్‌రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ సీహెచ్.వెంకట్రామిరెడ్డి (ఏడీ , ఐఎస్‌డీపీ, ఒంగోలు), ప్రధానకార్యదర్శిగా కెజసుధీర్‌బాబు(ఏడీ, ఏవీహెచ్, టంగుటూరు), కోశాధికారిగా ఎన్.శ్రీరాములు (త్రిపురాంతకం), ఉపాధ్యక్షులుగా పి.శ్రీరాములు (ఏడీ, డిప్యూడీ డైరెక్టర్, కందుకూరు), జాయింట్ సెక్రటరీగా బి.బసవశంకరరావు (ఏడీ, ఏవీహెచ్ త్రోవగుంట)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పశుసంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ బేబీరాణిని కలిసి బొకే అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా రజిత

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిలా మహిళావిభాగం చైర్‌పర్సన్‌గా కాట్రగడ్డ రజిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం మహిళావింగ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా రజిత, జిల్లా కన్వీనర్‌గా వనజ, ట్రెజరర్‌గా ప్రసన్న, కో చైర్మన్లుగా శ్రీదేవి, అనుపమ, గురుదేవి, సునీత, కో కన్వీనర్లుగా సుజాత, నాగమణి, త్రివేణి, ప్రసన్న, జి.సుజాత, ప్రతిమలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల్లోని మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు. తనను జిల్లా చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవడం పట్లపై ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లాకార్యదర్శి వరకుమార్, శ్రీనివాస్, మోటార్ శ్రీనివాసరావు, సురేష్‌బాబు, గోపీకృష్ణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

ఒంగోలు క్రైం, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం మిషన్‌లో నగదు దొంగిలించేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. ఈ సంఘటన ఒంగోలు నగరం దిబ్బలరోడ్డులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం పగుల గొట్టెందుకు దొంగలు ప్రయత్నం చేశారు. అయితే నగదు ఉన్న బాక్స్ తెరుచుకోక పోవడంతో పరారీ అయారు. నిత్యం పోలీసులు గస్తీ తిరిగే కర్నూల్‌రోడ్డుకు దగ్గరలో ఉన్న చోట ఏటీఎంలో దొంగలు చోరీకి ప్రయత్నం చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

జగనన్న పాపం..

స్థలమేకాదు.. ఇల్లు నిర్మించి తాళాలు చేతిలో పెడతామన్నారు...

గుడారాలకే పరిమితం చేశారు

ఆ స్థలాలు కూడా అందరికీ ఇవ్వలేదు

ఇదీ అద్దంకి పట్టణం గుండ్లకమ్మ నది ఒడ్డున ఉంటున్న యానాదుల కుటుంబాల ఆవేదన

ఇచ్చిన వాటిల్లో గుడిసె వేసుకుంటామంటే ఒప్పుకోని అధికారులు



పాత దర్శి రోడ్డులో యానాదుల ఇళ్లు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని పాత దర్శి రోడ్డులో గుండ్లకమ్మనది ఒడ్డున సుమారు 10 యానాది కుటుంబాల వారు సుమారు 4 దశాబ్దాల నుంచి తాత్కాలిక గుడారాలు వేసుకొని నివాసం ఉంటున్నారు. వారికి కనీసం విద్యుత్, తాగునీటి వసతి కూడా లేదు. వైసీపీ పాలనలో వారికి స్థలాలు కేటాయించి ఇంటిని నిర్మించి తాళాలు చేతకి ఇస్తామని జగన్ చెపితే.. ఇక గుడారాల బతుకులకు తెరపడినట్లేనని వారు భావించారు. కానీ వారి ఆశలు నెరవేరలేదు. ఇళ్ల స్థలాలైతే ఇచ్చారుగానీ, ఇంటి నిర్మాణం చేసి ఇస్తామని చెప్పి మడమ తిప్పారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంలోనూ ఐదారు కుటుంబాలకే ఇచ్చారు. మిగిలిన వారికి ఇవ్వలేదు.

ఇంటిని నిర్మించే స్థోమత లేదు

కడు బీదవారమైన తాము ఇంటిని కట్టుకునే స్థోమత లేదని, ఆ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటామంటే అధికారులు ఒప్పుకోవడంలేదని యానాదులు వాపోతున్నారు. ఇళ్ల స్థలాలు ఉన్నా.. పాత గుడారాలలోనే బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేసుస్తున్నారు. స్థలాలు ఐదారు కుటుంబాలకే ఇవ్వగా, మిగిలిన వారికి ఇవ్వలేదు. దీంతో అందరూ అక్కడే నివాసముంటున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన కుటుంబాలకు కూడా స్థలాలు కేటాయించడంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తే సొంత గూడు ఏర్పడుతుందని వారు ఆశిస్తున్నారు.

ఇళ్లు కట్టిస్తామని చెప్తే ఆనందించాం.. ఆశ నిరాశైంది

అంజమ్మ



స్థలం ఇచ్చి ఇంటిని కట్టించి ఇస్తామని జగనన్న చెప్తే ఆనందించాం. నాగులపాడురోడ్డులో ఉన్న లేఅవుట్‌లో స్థలం ఇచ్చారు. కానీ ఇంటిని కట్టివ్వలేదు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతోపాటు అదనంగా వేసుకుని ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. కనీసం మాకిచ్చిన స్థలంలో గుడారమైనా వేసుకుంటామంటే అధికారులు ఒప్పుకోవడం లేదు. దీంతో ఇక్కడే ఉంటున్నాం.

ఇంటి స్థలం ఇవ్వలేదు

చెంచమ్మ



ఇళ్ల స్థలాలు కొంతమందికే ఇచ్చారు. ఇంకా కొన్ని కుటుంబాలకు స్థలాలు ఇవ్వలేదు. కనీసం కరెంట్, నీళ్లు కూడా లేకుండానే జీవనం సాగిస్తున్నాం. ఇంటి స్థలం కేటాయించి, కట్టిస్తే అందరితో కలిసి ఉంటాం. కనీసం మా పిల్లల జీవితాలైనా బాగుపడేలా చేయండి.

ఏడాదైనా వీడని కేసు మిస్టరీ!

బోయనవారిపాలెంలో ఇసుక డంప్ చేస్తుండగా టిప్పర్‌లో గుర్తుతెలియని మృతదేహం

నేటికీ లేని పురోగతి

చంపారా ? లేక పొరపాటున జరిగిందా?

విచారణ జరుగుతోందంటున్న పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై శివకుమార్(ఫైల్)

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 8 : ఇంటి నిర్మాణం కోసం తోలించుకుంటున్న ఇసుక లోడ్‌లో గుర్తుతెలియని సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉండడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఈ ఘటన జరిగి సరిగ్గా ఏడాదైంది. నేటికీ కేసు పురగోతి కనిపించలేదు. ఈపూరుపాలెం పంచాయతీ పద్మనాభునిపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పటి ఎస్పీ వకుల్ జిందాల్ దీనిపై స్పందించారు. ఇది ఎవరు చేశారనే కోణంతోపాటు అసలు మృతుడు ఎవరనే ఆధారాల కోసం ముమ్మర ప్రయత్నాలు సాగించారు. ఆ క్రమంలో కొందరు ఇసుకాసురుల పలుకుబడితో ఆ అంశం గాలిలో కలిసింది. బాధిత బంధువులు ఎవ్వరూ ముందుకు రాకపోవడం కూడా వాస్తవాలు కనుమరుగునకు కలిసొచ్చింది. ఈ కేసు గుట్టు ఇంకా ఎంత కాలానికి వీడుతుందో చూడాలి.

అసలేమి జరిగింది

ఈపూరుపాలెం పంచాయతీ పద్మనాభునిపేటకు చెందిన ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణం చేపట్టారు. అందుకు అవసరమైన ఇసుకను నింపేందుకు గతేడాది ఏప్రిల్ మొదటి వారంలో సుమారు 10 ట్రక్కుల ఇసుకను తోలించారు. ఆ ఇసుకను నాలుగు రోజుల అనంతరం ఎక్స్‌కవేటర్‌తో బేస్మట్టంలో నింపుతుండగా అందులో మృతదేహం కనిపించింది. దీంతో అవాక్కయిన యజమాని విషయాన్ని ఈపూరుపాలెం పోలీసులకు చెప్పారు. అప్పటి సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్సై మర్రి శివకుమార్ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని వెలుపలకు తీయించగా నుజ్జునుజ్జయిన సుమారు 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.

విచారించి చర్యలు చేపడతాం

ఎండీ మొయిన్, డీఎస్పీ, చీరాల



అప్పట్లో మృతుని తలభాగం దెబ్బ తినడం వలన ఆనవాళ్లు గుర్తించలేని పరిస్థితి. అతని బంధువులు ఎవ్వరూ ముందుకు రాలేదు. ఈక్రమంలో సమస్య పరిష్కారం జరగలేదు. అతడి కుడిభుజంపై పచ్చబొట్టు మాత్రమే ఉంది. పూర్తి విచారణ అనంతరం చర్యలు చేపడతాం. నేరస్థులు తప్పించుకోలేరు.

ఉపాధి వేతనాలు కోసం కూలీల ఎదురుచూపులు

3 నెలలులుగా వేతనాల బకాయి



మార్టూరులో జరుగుతున్న ఉపాధిపనులు(ఫైల్)

మార్టూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు 3 నెలలుగా వేతనాలు రాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చిలో పనిచేసిన కూలీలకు ఇంతవరకు కూలి డబ్బులు వారి బ్యాంక్ ఖాతాలకు జమ కాలేదు. ఈ మూడునెలలకు సంబంధించి ఒక్కొక్కరు కనీసం 30 రోజులకు పైగా పనిచేశారు. దాంతో ఒకరికి సుమారు రూ.10 వేల దాకా కూలి వచ్చే అవకాశం ఉంది. ఇతర పనులు లేకపోవడం, ఉపాధి కూలి డబ్బులు రాకపోవడంతో ఇబ్బందిగా ఉందని కూలీలు వాపోతున్నారు. దీంతో మండలంలో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టింది. మంగళవారం సుమారు 3500 మంది ఉపాధి పనులకు కూలీలు వెళ్లారు. వాస్తవంగా మండలంలో రోజుకు 7 వేల మందికి పైగా కూలీలు ఉపాధి పనులకు వెళతారు. ఇంకా పూర్తి స్థాయిలో పనులకు అనుమతి రాకపోవడం వలన పనులు తక్కువగా జరుగుతున్నాయని కూలీలు చెప్తున్నారు. ప్రస్తుతం పంటకాలువలు, చెరువులు పూడిక, వాగులు వద్ద ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. మరో వారం రోజులలో మరిన్ని పనులకు అనుమతి లభిస్తుందని, తద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సిబ్బంది చెప్తున్నారు. అదేవిధంగా ఎండలు ఎక్కువగా ఉండడంతో కూలీలు పనిచేసే సమయంలో వారికి మంచినీరు, మజ్జిగ తదితర వసతులను అధికారులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

కొనుగోళ్ల పరిశీలన.. రైతులతో భేటీ

పొగాకు వేలం కేంద్రాలను సందర్శించిన ఈడీ విశ్వశ్రీ

నోబిడ్లు లేకుండా చూడాలన్న రైతులు, ధరల పెంపునకు వినతి



ఒంగోలు-2 లో కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పొగాకు వేలంకేంద్రాలను బోర్డు ఎగ్జిక్యూటి వ్ డైరెక్టర్ (ఈడీ) బి.విశ్వశ్రీ మంగళవారం సందర్శించారు. పొగాకు కొనుగోళ్ల తీరును పరిశీలించడంతో పాటు రైతులతో సమావేశాలు నిర్వహించారు. పక్షంరోజుల క్రితం పొగాకు బోర్డు ఈడీగా బాధ్యతలు స్వీకరించిన విశ్వశ్రీ తొలిసారి జిల్లాలోని వేలంకేంద్రాలు సందర్శనకు రాగా పొగాకు రైతులు ఘన స్వాగతం పలకడంతోపాటు ప్రస్తుతం మార్కెట్లో ఉన్న సమస్యలను కూడా ఆమె దృష్టికి తీసుకెళ్లారు. తొలుత త్రోవగుంట సమీపంలోని ఒంగోలు-2 వేలం కేంద్రానికి వచ్చిన విశ్వశ్రీకి అక్కడి రైతు ప్రతినిధులు వడ్డెళ్ళ వరప్రసాద్, మండవ శివన్నారాయణ, పెనుబోతు సునీల్, యర్రంనేని శేషయ్య, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వేలంకేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలించారు. ఆ తర్వాత టంగుటూరు, కొండపి, ఒంగోలు-1, వెల్లంపల్లి వేలం కేంద్రాలను కూడా సందర్శించారు. పొగాకు వేలం జరుగుతున్న తీరు, మార్కెట్‌లోకి వస్తున్న పొగాకు బేళ్ల నాణ్యత, లభిస్తున్న ధరలు, ఏ కంపెనీ బయ్యర్లు ఏ తరహా పొగాకు కొనుగోలు చేస్తున్నారు. ధరలు ఎంతమేర లభిస్తున్నాయి తదితర అంశాలను ఆయా వేలంకేంద్రాల్లో పరిశీలించారు. పలుచోట్ల తిరస్కరణకు గురైన బేళ్లను, వాటి గ్రేడ్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా వేలం కేంద్రాల్లో రైతులతో నిర్వహించిన సమావేశాల్లో పలువురు రైతు ప్రతినిధులు మాట్లాడుతూ కొన్నిరకాల బేళ్ల తిరస్కరణకు గురవుతున్న విషయాన్ని ఈడీ విశ్వశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఇస్తున్న ధరలు బాగా ఉన్నట్లుగా కనిపిస్తున్నా ఈ ఏడాది ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ధరలు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సగటు ధరలు పెరిగేలా చూడటంతోపాటు నోబిడ్‌లు లేకుండా చూడాలని కోరారు. రైతులు వినతిపై స్పందించిన ఈడీ విశ్వశ్రీ వచ్చే వారం వ్యాపార ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ధరల విషయమై చర్చిస్తామని హామీ ఇచ్చారు. నోబిడ్ బేళ్లపై స్పందిస్తూ ప్రస్తుతం మార్కెట్లో కొనుగోళ్లు జరుగుతున్న గ్రేడ్ల రకం బేళ్లను వేలంకు తీసుకు రావాలని సూచించారు. పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య, బోర్డు సెక్రటరి దివి వేణుగోపాల్, సభ్యుడు పొద వరప్రసాదరావు, ఆర్‌ఎం లక్ష్మణరావుపాల్గొన్నారు.

వాదులాట.. ఆపై సర్దుబాట

రెవెన్యూ, అటవీ శాఖాధికారుల చర్చలు

- సీబీజీ ప్లాంట్ స్థలం ప్లాంటు స్థలం వద్ద పరిశీలన



చర్చలు జరుపుతున్న రెవెన్యూ, అటవీ శాఖాధికారులు

కురిచేడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామం సర్వే నంబర్లు 88, 90 లలో ఏర్పాటుచేస్తున్న రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కుకు కేటాయించిన స్థలం వద్ద మంగళవారం రెవెన్యూ, అటవీ శాఖాధికారులు చర్చించారు. ఎవరి హద్దులు వారు చెక్ చేసుకున్నారు. వారి వారి రిపోర్టులు తయారు చేసుకుని ఉన్నతాధికారులకు పంపారు. తహసీల్దార్ రజనీకుమారి, సర్వేయర్లు, ఆర్ఐ, వీఆర్వోలతో రాగా, అటవీ శాఖ జిల్లా అధికారి వినోద్ కుమార్ తమ సిబ్బందితో వచ్చారు. ప్రారంభంలో ఇరు శాఖాధికారులు స్థలం మాదంటే మాదని వాదులాడుకొని చివరకు సర్దుకుపోయారు. ఉన్నతాధికారులు ఏం చెప్తే అదే చేద్దామనే నిర్ణయానికి వచ్చారు. మంగళవారం ఉదయం నుంచి ఎక్స్‌కవేటర్లతో చిల్లచెట్లను తొలగించే పనులు చేపట్టారు. పనులు జరుగుతుండగానే అధికారులు చర్చించుకున్నారు. అటవీ శాఖకు చెందిన డీఎఫ్‌వో వినోద్ కుమార్, అసిస్టెంట్ డీఎఫ్‌వో పి.శ్రీనివాసరావు, ఎఫ్ఆర్‌వో నరసింహారావు, డిప్యూటీ ఆర్‌వో బి.నాయక్, ఎఫ్‌బీవో ధనలక్ష్మి, తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో హనుమంతరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అవీఇవీ

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య



సీతారాములకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట లక్ష్మీ శ్రీనివాస కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ విజయ గణపతి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామి కల్యాణం, పట్టాభిషేకం, ఏకాంత సేవను తిలకించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మునిసిపల్ కమిషనర్‌పై పోలీసులకు ఫిర్యాదు

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని జరగనివ్వకుండా వ్యవహరించిన మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌పై చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు కోరారు. ఈమేరకు మంగళవారం వన్‌టౌన్ సీఐ నూరేపల్లి సుబ్బారావును కలిసి ఫిర్యాదు చేశారు.

నివేశన స్థలాలపై వివాదం

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : 1999లోనే ప్రభుత్వం తమకు పట్టాలు మంజూరు చేసిందని, ఆ స్థలాలను ఇప్పుడు ఖాళీ చేయమంటున్నారని మండల పరిధిలోని సాయికాలనీలోని కొందరు వ్యక్తులు తెలిపారు. ఇక్కడ కొంత స్థలానికి సంబంధించి నెలకొన్న వివాదంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. ఇక్కడ నివాసముంటున్న వారిని ఖాళీ చేయించాలని కొంతమంది కక్షబూనినట్లు ఆరోపించారు. కోర్టు ఇప్పటికే మరొకరికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఆమేరకు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అంతా మా ఇష్టం

పట్టణంలో ఇష్టారీతిగా పార్కింగ్‌లు చేస్తున్న హైర్ బస్‌లు

రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



చీరాల - పేరాల రహదారిలో రోడ్డును ఆక్రమించి పార్కింగ్

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రాత్రి వేళల్లో ఎక్కడ పడితే అక్కడ హైర్ బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. చీరాల - పేరాల ప్రధాన మార్గంతోపాటు పట్టణంలోని పలు ప్రధాన మార్గాల్లో సైతం ఇష్టానుసారంగా బస్సులను నిలిపి ఉంచుతున్నారు. మమ్మల్ని అడిగేవారెవరు అన్నట్లుగా బస్సు డ్రైవర్లు పార్కింగ్ చేస్తున్నారు. సాధారణంగా హైర్ బస్సు సర్వీసు ముగిశాక వారు నిర్దేసించిన లేక నిర్ణయించుకున్న ప్రదేశాలలో మాత్రమే బస్సులను పార్కింగ్ చేయాల్సి ఉంది. కానీ డ్రైవర్‌లు మాత్రం ప్రధాన రహదారుల్లో వామనాలు నిలిపి ఉంచడంతో మిగతా వాహనాలకు, ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం

ఐదేళ్ల తర్వాత తిరిగి ప్రారంభమైన రుణాలు

ఎస్సీల్లో చిగురిస్తున్న ఆశలు

జగన్ హయాంలో మూలనపడ్డ పథకాలు

రుణాల మంజూరుకు 11 నుంచి దరఖాస్తులు



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

ఒంగోలు నగరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా మూలనపడ్డ ఎస్సీ కార్పొరేషన్‌కు కూటమి ప్రభుత్వం పూర్వవైభవాన్ని తేనుంది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటివరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అమలు చేసిన అన్ని పథకాలను మూలన పడేసింది. ఒక్క ఎస్సీ కార్పొరేషన్ మాత్రమే కాదు బడుగుల ఆర్థికాభివృద్ధి కోసం పనిచేసే బీసీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు కూడా నిధుల లేకుండా చేసింది. వైసీపీ అధికారంలో ఉండగా కార్పొరేషన్లు ద్వారా ఎన్నో ఏళ్లగా అమలు జరుగుతున్న అన్నిరకాల పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసింది. ఒక్క పైసా కూడా కేటాయించలేదు. దీంతో రాష్ట్రంలోని బడుగు వర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి టీడీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల కాలంలోనే కార్పొరేషన్లకు జవసత్వాలు తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే బీసీ కార్పొరేషన్ ద్వారా వేలాదిమందికి యూనిట్లును అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తిచేసింది. ఇదేవిధంగా బడుగుల కార్పొరేషన్లలో అగ్రగామిగా నిలిచే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా పేదలకు రుణాలను అందించేందుకు రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది.

11నుంచి రుణాలకు దరఖాస్తులు

గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఉన్న అన్ని పథకాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. ముందుకుగా బ్యాంకు లింకేజితో ఎస్సీలకు పెద్దఎత్తున రుణాలను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకోసం ఈనెల 11వతేదీ నుంచి ఎస్సీల నుంచి రుణాల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానించింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.800కోట్లకుపైగా రుణాల రూపంలో ఎస్సీలకు అందజేయనున్నారు. ఈనెల 11వతేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై మే నెల 10వ తేదీతో గడువు ముగుస్తుంది. మే 20వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తవుతుంది. 60శాతం, 40శాతం సబ్సిడీతో యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రుణాలను మంజూరు చేయనుంది. రూ.10లక్షలకుపైగా యూనిట్ విలువతో ఎస్సీలకు ప్రభుత్వం నుంచి రుణాలు మంజూరు కానున్నాయి. ఇందులో లబ్ధిదారుల వాటాగా 5శాతం చెల్లించాల్సి ఉంది. సబ్సిడీ గరిష్ఠంగా రూ.లక్ష అందజేయనున్నారు. రాష్ట్రప్రభుత్వం ముందుగా బ్యాంకు లింకేజి రుణాలకు దరఖాస్తులను ఆహ్వానించగా కొద్దిరోజుల్లోనే వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన అన్ని పథకాలను తిరిగి పునఃప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

రుణాల పేరుతో మోసం చేసిన వ్యక్తులపై కేసు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రుణాలు ఇప్పిస్తామంటూ, వ్యాపారాలలో పెట్టుబడి పెడితే బారీగా లాబాలు వచ్చేలా చేస్తామని పలువురిని నమ్మించి నగదు కాజేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు యస్ఐ బి.శ్రీకాంత్ తెలిపారు.నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన తండ్రి కుమార్తెలు కోటి విజయ్‌కుమార్, కోటి స్మైలీ పలువురి వద్దనుండి పిఎంఇజిపి రుణాలు ఇప్పిస్తామని, బాతుల వ్యాపారం పేరుతో నమ్మబలికి పలువురు అమాయకుల వద్ద నుండి లక్షల్లో నగదును వసూలు చేయడంతో బాదితుల పిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు యస్ఐ తెలిపారు.

నాడు ముద్దు.. నేడు వద్దు..!

- జిల్లా మార్పుతో కొత్త ఇబ్బందులు
- పోలీస్ సిబ్బంది అయిష్టంగా విధులు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కి పోస్టింగ్ అంటే ఎంతో ఇష్టంగా ఉండేది... అయితే ప్రస్తుత పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా మారింది. దీనికి కారణం అప్పుడు జిల్లా కేంద్రమైన ఒంగోలుకు సమీపంలో ఉండడంతో పాటు ఎప్పుడూ రవాణా సౌకర్యం ఉండేది. అయితే వైసీపీ నిర్వాకంతో జిల్లాల పునర్విభజనతో అద్దంకి నియోజకవర్గం కాస్తా బాపట్ల జిల్లాలోకి చేరింది. దీంతో మిగితా శాఖలతో పాటు ఆ షాక్ మరింత ఎక్కువగా పోలీస్ శాఖపై పడింది. బాపట్లకు అద్దంకి నుంచి సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, సొంత వాహనం ఉంటే తప్ప త్వరగా చేరుకోలేని పరిస్థితి ఉంది. దీంతో అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో విధులు అంటే పనిష్మెంట్‌గా భావించే పరిస్థితి నెలకొంది. దీంతో సిబ్బంది కేటాయింపు జరిగినా బలవంతంగా వచ్చి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితులలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యాపరంగా, ఇతర వసతుల కోసం సిబ్బంది అత్యధిక శాతం బాపట్ల పరిసర ప్రాంతాలలో స్థిరపడి ఉండడంతో ప్రస్తుతం అక్కడ నుంచి అద్దంకి వచ్చి విధులు నిర్వహించడం కష్టంగా మారిందనే అభిప్రాయం నెలకొంది. ఇక అత్యవసరంగా విధులకు వెళ్లాల్సి వస్తే సిబ్బంది కోసం వెతుక్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం నెలకొంది. అద్దంకి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో ప్రొటోకాల్‌కు సిబ్బంది వెళ్లాల్సి ఉంటుంది. ఇక అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో గాడిలో పెట్టేందుకు సీఐ సుబ్బరాజు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో సాయంత్రం, ఉదయం సమయాలలో సిబ్బంది అందరూ ట్రాఫిక్ విధులు నిర్వహించాల్సి ఉంది. దొంగతనాలు అరికట్టేందుకు కూడా రాత్రి సమయాలో గస్తీ మరింత పెంచాల్సిన అవసరం కూడా ఉంది. పగలు సమయంలో అడపాదడపా బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్, రామాటాకీస్ రోడ్డు తదితర ప్రాంతాలలో కూడా గతంలో జరిగి ఉండడంతో పగలు సమయంలో కూడా సిబ్బంది నిఘా పెట్టి ఉంచాల్సిన అపసరం ఉంది. ఇలా సిబ్బంది మొత్తం పూర్తి సమయం విధులు నిర్వహించాల్సి రావడంతో వీలైనంత వరకు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ఆ ప్రభావం మిగిలిన సిబ్బందిపై పడి వాళ్లు కూడా ముఖం చాటేసే పరిస్థితి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో అద్దంకి పోలీస్ స్టేషన్‌కు మరింత ఎక్కువ మంది సిబ్బందిని కేటాయించే విధంగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాల పునర్విభజన చేసి మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేస్తామని ఇటీవల మార్కాపురం పర్యటనలో సీఎం చంద్రబాబు చెప్పారు. దీంతో అద్దంకి నియోజకవర్గం మరలా ప్రకాశం జిల్లా పరిధిలోకి చేరే అవకాశం ఉంది. అప్పుడు మరలా సిబ్బంది అద్దంకిలో విధులు అంటే పరుగెత్తే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.



అద్దంకి పోలీస్ స్టేషన్


శింగరకొండలో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభం తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఈవో

కొనసాగుతున్న ధ్వజ స్తంభం తొలగింపు

మే 19న తిరిగి ప్రతిష్ఠ

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో 1984లో ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభాన్ని మంగళవారం తొలగింపు చర్యలు చేపట్టారు. 4 దశాబ్దాల కిందట పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ శంకరారెడ్డి సహకారంతో ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. పూర్తిగా దెబ్బతినడంతో కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటుకు వీలుగా సోమవారం పూజలు నిర్వహించి మంగళవారం ఈవో తిమ్మానాయుడు, ఆర్ఐ శంకర్, శింగరకొండపాలెం పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య, ఏఎస్సై వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కార్యక్రమం సాగింది. అయితే ధ్వజ స్తంభం అడుగుభాగాన ఉన్న కాంక్రీట్ దిమ్మె పగలకపోవడంతో బుధవారం కంపర్షన్ ద్వారా తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు రూ.7కోట్ల రాతి ముఖ మండప నిర్మాణం పనులు పూర్తి చేసి మే నెల 19వ తేదీ కుంబాభిషేకం జరగనుంది. అదే రోజు మేదరమెట్ల శంకరారెడ్డి సహకారంతో సుమారు రూ.15 లక్షల వ్యయంతో కొత్త ధ్వజ స్తంభం ప్రతిష్ఠ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ధ్వజ స్తంభం చుట్టూ రాతి శిలామండపం నిర్మాణానికి శింగరాయకొండ మండలం కనుమళ్లకు చెందిన కాట్రగడ్డ అనిల్‌కుమార్ రూ.8లక్షలు ఇప్పటికే అందజేశారు.

కేజీబీవీలో వసతి గృహాల నిర్మాణం ప్రారంభం

బల్లికురవ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.1.20కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో విద్యార్థినుల వసతి గదులను నిర్మాణం చేయనున్నారు. మంగళవారం నుంచి నూతన భవనాల పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. పిల్లర్ల ఏర్పాటుకు గుంతలు తీసి పనులు ప్రాంభించారు. ఆరు నెలల వ్యవధిలో పూర్తి స్థాయిలో పనులు చేయిస్తామని ఏఈ రాజన్‌బాబు తెలిపారు.

గోశాలకు తవుడు అందజేత

అద్దంకిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకిలోని హరి హర గోశాలకు మంగళవారం తవుడును అందజేశారు. అమృతాహార క్యాంటీన్ యజమాని మంగరావు, రోటరీ మిత్రుల సహకారంతో హరిహర గోశాలకు 7 బస్తాల తవుడును అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కురిచేటి చిన్ని, గోశాల నిర్వహకుడు సుబ్బారావు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన

మార్టూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను రూ.50కి పెంచడంపై రైతు సంఘం నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు కట్టెలతో వంటచేసి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, బి నూరిబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

పర్చూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు ముందుగా ప్రతి మూడు సంవత్సరాలకోసారి భూసార పరీక్షలు తప్పక చేయించుకునే విధంగా సిబ్బంది అవగాహన కల్పించాలని ఏడీఏ ఎన్.మోహనరావు అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో మంగళవారం పర్చూరు సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై త్వరలో మహిళా సమాఖ్య భవనాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఏడీఏ చెప్పారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏవోలు, ఏఈవోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోలలపూడి విద్యార్థినికి ఏపీ మోడల్ స్కూల్‌లో సీటు

మార్టూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో 5 వతరతగతి చదువుతున్న యడవల్లి లాస్య ఏపీ మోడల్ స్కూల్‌లో 6 వతరగతిలో ప్రవేశానికి సీటు సాధించినట్లు మంగళవారం ప్రధానోపాధ్యాయులు గోగినేని బాలకృష్ణ తెలిపారు.

హోమియో వైద్యంతో శాశ్వత పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పలు రోగాలకు హోమియో మందులతో శాశ్వత పరిష్కారం ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం రోటరీ కమ్యూనిటీ భవనంలో హోమియో పితామహుడు, శాస్త్రవేత్త డా.శామ్యూల్ హానిమూన్ జయంతి వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. చీరాల హోమియో ఫిజిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హానిమూన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల నెలసరి, చిన్నారుల ఎదుగుదల, సీజనల్ వ్యాధులపై హోమియో మందుల ప్రభావాన్ని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డా. శ్రీనివాస్, దేగల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, గవీష్, మురళీకృష్ణ, డా.ప్రదీప్, డా.అశోక్ పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడిచి వస్తున్న వ్యక్తిని వెనుక నుంచి మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేసే కట్టమూరి అప్పన్న సోమవారం రాత్రి సమీపంలోని టీ దుకాణంలో మరో వ్యక్తితో కలిసి టీ తాగి వస్తుండగా శంకరాపురం వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని మోటార్‌సైకిలిస్టు ఢీకొని వెళ్లిపోయాడు. క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఒంగోలు రిమ్స్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు. అద్దంకి సమీపంలోని కలవకూరు రోడ్డులో మంగళవారం సాయంత్రం మొక్కజొన్నల బస్తాలతో వెళ్తున్న ట్రాక్టర్‌కు ఎక్స్‌కవేటర్ తగలడంతో కొన్ని బస్తాలు రోడ్డుపై పడ్డాయి. అయితే ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

అవిశ్వాసం నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కౌన్సిల్ హాల్లో బుధవారం సాధరణ సమావేశం జరుగనుంది. ఆ సమాచారాన్ని కమిషనర్ అబ్దుల్ రషీద్ అధికారికంగా తెలియజేశారు. ఇటీవల జరిగిన అవిశ్వాసం అంశం తార స్థాయికి చేరిన క్రమంలో జరిగే ఈ సమావేశం ఉత్కంఠగా మారనున్నట్లు తెలుస్తోంది. అజెండాలో పొందు పరిచిన అంశాలతో పాటు ఎలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటాయోనని అందరి కళ్లు కౌన్సిల్ వైపు మారాయి.


బైటమంజులూరులో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

రీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

పంగులూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రీ-సర్వే ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ వీ సింగారావు అన్నారు. మండలంలోని బైటమంజులూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వేలో సిబ్బంది గుర్తించిన నిర్దేశిత భూ వివరాలను తహసీల్దార్ సింగారావు మంగళవారం పరిశీలించారు. ల్యాండ్ వ్యాలిడేషన్‌తో పాటు, జారీ చేసిన 9 - 2 నోటీసుల గురించి తెలుసుకున్నారు. రీసర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద ఉండి సర్వే నిర్వహించే సిబ్బందికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మే 19న శింగరకొండలో మహాకుంభాభిషేకం

ఏర్పాట్లను పరిశీలించిన శృంగేరి పీఠం శిష్య బృందం

అద్దంకి,ఏ ప్రిల్8(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖమండపం పనులు పూర్తయి మే 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి పర్యవేక్షణలో మహాకుంభాభిషేకం జరుగనుంది. ఈ నేపథ్యంలో శృంగేరి పీఠం శిష్యబృందం మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. శమంతకశర్మ, విద్యాశంకర్ రాతి మండపం పనులు, మహాకుంభాభిషేకం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు హరిశంకరావధాని ఉన్నారు.

ముఖమండపానికి విరాళాల అందజేత


విరాళాన్ని అందజేస్తున్న గోపాలరావు, బసవమ్మ దంపతులు

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి ముఖ మండపం నిర్మాణానికి రెండు కుటుంబాలు లక్ష రూపాయలు చొప్పున మంగళవారం అందజేశారు. అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెంకు చెందిన న ర్రా వెంకటరావు, రంగనాయకమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రిటైర్డ్‌పీఈటీ గోపాలరావు, బసవమ్మ దంపతులు రూ.1,00,116, నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రానికి చెందిన నాయుడు వీరయ్యచౌదరి రాజ్యలక్ష్మి దంపతులు రూ.1,00,116 ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయాభివృద్ధికి రూ.5లక్షల విరాళం

పర్చూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వై.జంక్షన్‌లో ఏర్పాటు చేసిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకొస్తున్నారు. ఇప్పటికే దాదాపు రూ.4కోట్ల వ్యయంతో ఆలయం రూపుదిద్దుకుంది. భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలన్న సంకల్పంతో ఆలయ కమిటీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఆలయాభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రావి రంగనాథబాబు ధర పత్ని నాగవర్ధిని రూ.5,25,116లక్షల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దంపతులను కమిటీ సభ్యులు అభినందించారు. కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, మంగళగిరి కోటేశ్వరరావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహం, రంగిశెట్టి రామాంజనేయులు, తులసి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోషణ పక్వాడా పక్షోత్సవంపై ర్యాలీ

చినగంజాం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలో పోషణ పక్వాడా పక్షోత్సవంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ పక్వాడా పక్షోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వెబ్ కాస్ట్ లింక్ ద్వారా సిబ్బంది వీక్షించారు. మంగళవారం నుంచి ఈ నెల 22 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తెలిపారు. వంద రోజుల సంరక్షణ, లబ్ధిదారులు స్వయంగా పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేసుకునే విధానం, కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం, పిల్లలలో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అనే నాలుగు థీమ్‌లపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.వాణిశ్రీ, ఎన్.సుమలత, కె.ఉషాకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు అమృతం

పంగులూరు : తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని, ప్రతి తల్లి బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు శిశువుకు అందించాలని ఐసీడీఎస్ ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. పంగులూరులోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తల్లిపాల ప్రాధాన్యతను సూపర్‌వైజర్ పద్మావతి అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమం ఈ నెల 8 నుంచి 22 వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయమ్మ, జ్యోతిర్మయిబాబు, విశ్రాంత బ్యాంక్ అధికారి గుడిపూడి రామారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుకన్య, లత, అన్నమ్మ, రజని, పీరాబి, సులోచన పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో-2 సుధాకరరావు, ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థులకు అవసరమైన వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగపర్చుకోవాలని ఎంఈవో-2 బూదాటి సుధాకరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని సత్రంబడి పరిధిలోని గౌడపాలెం, గానుగపాలెంలో ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రత్యేక నమోదు కార్యక్రమంలో ఎంఈవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గృహాలను సందర్శించి 5 ఏళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా విద్యార్థులకు తల్లిదండ్రులు అవగాహన కల్పించారు. ఇద్దరు చిన్నారులను 1వ తరగతిలో చేరేలా నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం ఎంతో ఖర్చు చేస్తుందన్నారు. ఉచిత పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, తల్లికి వందనం కింద రూ.15వేలను అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈ రామారావు, ఉపాధ్యాయులు, సీఆర్పీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గుర్రవారిపాలెంలో, బొమ్మనంపాడు, శంఖవరప్పాడు, తిమ్మాయపాలెం, వెంపరాల గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించారు.

ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌పై అభ్యంతరాలు తెలపండి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు


మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, పక్కన తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఓటు కార్డు నవీకరణ (ఎన్‌రోల్‌మెంట్)లో అభ్యంతరాలు ఉంటే వెంటనే పరిష్కారం పొందాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులతో, ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. నూతన, తొలగింపులు, మార్పులు, చేర్పులపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని 218 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోలతో మాట్లాడుతూ వచ్చిన అర్జీల్లో సమస్యలు ఉంటే నేరుగా అధికారి దృష్టికి తెచ్చి, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, మునిసిపల్ డీఈ రఘురామ్, ఎలక్షన్ డీటీ సుశీల పాల్గొన్నారు.


మొండితోకపాలెంలో డ్రైన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

అద్దంకి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్ని ప్రాంతాలలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. పట్టణంలోని మొండితోకపాలెం, గుర్రాలకాలనీ తదితర ప్రాంతాలలో కమిషనర్ పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరాను పరిశీలించారు. గుండ్లకమ్మ నదిలో ఊట బావుల వద్ద మంచినీటి పంపింగ్‌ను పరిశీలించారు.

22న మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈనెల 22న ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బత్తుల శామ్యేల్, నాగేశ్వరరావు, పైడయ్య, వెంకటేశ్వరమ్మ, విజయ, చాముండేశ్వరి, భారతి, అంజనికుమారి పాల్గొన్నారు.


విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

టెక్నాలజీతో ఉన్నతంగా రాణించండి

చీరాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విద్యాభ్యాసం చేసిన అంశాల్లో ముఖ్యమైన ఆధునిక టెక్నాలజీ, ఎలక్ట్రికల్ వెహికల్స్, సోలార్ ఎనర్జీ వంటి వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. ఈసందర్భంగా వారికి స్ఫూర్తి దాయకమైన అంశాలపై పలు సూచనలు చేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. విద్యార్థులకు ప్రతినిధులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, డా.అనిల్‌కుమార్, డా.సీఎస్ రావు పాల్గొన్నారు.

శనగల తేమ శాతం 14కి మించరాదు


రైతులకు నిబంధనలు తెలియచేస్తున్న ఏవో, సీఈవో

పంగులూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):పంగులూరు మార్కెట్ యార్డ్ నందు శనగల కొనుగోలు కేంద్రంలో జేజే-11 రకం శనగలు కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. శనగల విక్రయంలో పాటించాల్సిన నిబంధనలను మంగళవారం ఏవో సుబ్బారెడ్డి, పీఏసీఎస్ సీఈవో లక్ష్మి రైతులకు వివరించారు. శనగ రైతులు తమ పంట విక్రయానికి రైతు సేవా కేంద్రాలలో తమ పేరు నమోదు చేసుకుని నిర్దేశిత సమయంలో పంటను అమ్ముకునే అవకాశం ఉందని తెలిపారు. క్లీనింగ్ కోసం డీ స్టోన్ చేయించాలని, తేమ శాతం 14కి మించకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లో జేజే 11 రకం క్వింటాకు రూ.5,650 ధర నిర్ణయించినట్లు తెలిపారు. జె.పంగులూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి పర్యవేక్షణలో శనగలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రజారోగ్య కేంద్రం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రజారోగ్య కేంద్రం

బల్లికురవ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లి ప్రాథమిక అరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నూతన భవనాలను ఏర్పాటు చేసింది. ఈ భవనం పనులు పూర్తి కావడంతో ప్రారంభం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50లక్షలను గుంటుపల్లి పీహెచ్‌సీలో క్షేత్ర స్థాయి ప్రజా అరోగ్య కేంద్రానికి సంబంధించిన భవనాలకు మంజూరు చేసింది. ఈ నిధులతో 4 గదులు ఏర్పాటు చేశారు. ఈ గదులలో అన్ని రకాల పరిక్షలు చేసేందుకు ల్యాబ్, కంప్యూటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ భవనాలను అన్ని రకాల వసతులతో నిర్మాణం చేయడంతో ప్రభుత్వం త్వరలో నూతన పరికరాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రజలు తెలిపారు. ఈ భవనం ఈ నెలాఖరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.